ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక.

సంపుటి - 32 - [illegible]

శ్రీ

ఆంధ్రసాహిత్యపరిషత్పత్రిక

కాకినాడ.

రెండునెలల కొకసారి ప్రకటింపఁబడును.

(Journal of the Telugu Academy.)

సంపుటము ౩౨. { స్వభాను మార్గశిర-ఫాల్గుణములు. } సంచిక ౫-౬

హాల్లోహలశబ్దవిమర్శనము.

దువ్వూరి సూర్యనారాయణశాస్త్రి.

ఆంధ్రసాహిత్యపరిషత్పత్రిక 32 సంపుటము 3-4 సంచికలలోఁ బైశబ్దమునుగూర్చి శ్రీనిడుదవోలు వెంకటరావు, ఎం. ఏ. గారు కొన్ని ప్రయోగములఁ జూపి, ఆయాయి యాధారములను బట్టి "మునిఁగి తేలుట, తొట్రుపడుట, చీకాకుపడుట, ప్రవాహము, మత్తత, మగ్నోన్మగ్నము" అను నర్థములతో నీపదము కావ్యముల వ్యవహరింపఁబడినది". అని వ్రాసియున్నారు.

ఈపదమున కిన్నియర్థములు గ్రహింపవలెనా? లేక వేఱొక యర్థము చెప్పవచ్చునా? ఈపదస్వరూప మెట్టిది? దీనిని సంస్కృత నిఘంటుకర్త లెందులకుఁ జూపలేదు? అనునదియే యీ నావ్యాసము నందలివిషయము.

చిన్నయసూరి తననిఘంటువునం దీపదము నొకచోట గ్రహించి భాగవతప్రయోగము (10 స్కం. 793 ప) నిచ్చియున్నాఁడు. అర్థముమాత్రము వ్రాసియుండలేదు. బ్రౌను నిఘంటువులోఁగూడ మనుచరిత్రలోనిపద్యము లక్ష్యముగా నీపదము చూపఁబడినది. మఱి మిగిలిన సంస్కృతాంధ్రనిఘంటువు లేవియు దీనిని గ్రహించియుండలేదు.

పరిశీలింపఁగా నీపదము ధ్వన్యనుకరణశబ్దముగాఁ బ్రయోగములు

చూచినవారి కెల్ల గోచరింపక పోదు. ఈశబ్దము "అల్లకల్లోల, హాళాహళి,
హాళహాళి, ఝుళఝుళి, ఝుళంఝుళి, ఝుళజ్ఝళి" మున్నగు శబ్దముల
వంటిది. ఇట్టి అనుకరణశబ్దములు కవుల కిచ్చవచ్చినట్లును, గణానుసార
ముగను బ్రయోగించుట, ఆంధ్రభాషలోఁ బ్రసిద్ధముగా నున్నది. ప్ర
కృతము లభ్యమైన ప్రయోగములందెల్ల ధ్వన్యనుకరణార్థము చెప్పినచోఁ
జక్కఁగఁ బొసఁగుచునే యున్నది. చూడుఁడు.

"హల్లోహల యనెడి మదబంభరముల కొక్క ధ్వను లొప్పఁగా"
అని చెప్పినచో మనుచరిత్రపద్యము (మను 2-6) సరిపడును. లేదా!
పూర్వానుగతముగా వచ్చుచున్న 'ఈహాత్ + లోహాల' అనియే చెప్పి
నచో నదియు సుసంగతమే. అప్పు డీపదమున కిచ్చటఁ బ్రసక్తియే లేదు.
కాని యిటఁ గొందఱు ఈహధాతువు పరస్మైపదము గాన దీని శత్రంత
రూపము శానచ్ రాగా 'ఈహమాన, అగునుగాని, ఈహాత్ కాదం
దురు. కాని 'అనుదాత్తేత్త్వలక్షణ మాత్మనేపద మనిత్యమ్, అను పరి
భాషచే పైరూపమున్న సాధువు కావచ్చును. ఇందులకుఁ దార్కాణగా
"స్ఫాయన్నిర్మోకసంధిః, అని మురారికవి ప్రయోగమును, "యుధ్యన్నేమ
మధ్యంబునన్" అని చిన్నయసూరిగారి ప్రయోగమును గానవచ్చుచునే
యున్నవి.

"హల్లోహల కలితయగుచు" అను భాగవతపద్యముకడఁ జిన్న
యసూరి "హల్లోహలకంకణాళి దైపె సతి కంటే?" అను పాఠమును
గ్రహించియున్నాఁడు. అప్పుడు సుకరముగా "హల్లోహలయను ధ్వని
కల కంకణములతో" అనఁగా గలగలమను ధ్వనితోఁ గూడినకంకణము
లు గలభిల్లకాంత యని చెప్పవచ్చును. ముద్రితపాఠముకన్న నీచిన్నయ
సూరి పాఠమే సొగసుగా సరిపడినది.

ఇఁకఁ బాండురంగమాహాత్మ్యమునందుఁ గృతిపతికి విశేషణ
ముగాఁ 'గంగాహల్లోహలవాగ్విలాస, అనియున్నది. ఇచ్చట 'గంగా

నదియొక్క హల్లోహలధ్వనివంటి మాటకారితనము కలవాఁడు, అని చెప్పినచో సరిపడును. ఇట వేగముగా మాటలాడునప్పటిధ్వని నదీఘోషవలె నడనడఁ దెగిపోక గంభీరముగా నున్నదని భావము. ఈపద్యమున 'రిపువర్ణ' అన్నచోట యతి పోయినదిగాన 'రిపువర్గ' అనియు 'హర్షాహవ' అన్నచోట 'హర్షావహ' అనియు 'హిమాహార్య' అన్నచోట 'హేమాహార్య' అనియు ముద్రణప్రమాదముల సవరించికొనవలెను.

ఇఁక దశావతారచరిత్ర పద్యమున "ప్రౌఢాంగనాకలనాదోదితపాహిపాహిముఖవాక్యకల్లోల హల్లోహలా" (దశా. 9-433) అని యున్నది. ఇట "ప్రౌఢ లగుస్త్రీలయొక్క మధురనాదముతో నుదితమైన పాహిపాహియనునవి మొదలగువాక్కు లనెడితరంగములయొక్క హల్లోహల యనెడిధ్వని కలవాఁడా !" అనఁగా రక్షింపుము రక్షింపు మనెడి స్త్రీలయొక్క కలకలరవము తరంగకలకలము వలె నున్నదని భావము. ఈపద్యమందు 'దృష్టిశ్రీ' అన్నచోట 'దృష్టశ్రీ' అనవలెను. లేనిచో యతిభంగము. 'స్ఖలదంతక్షత' అన్నచోట 'స్థలదంతక్షత' అనియు సవరించికొనవలెను.

ఇఁక నచలాత్మజాపరిణయపద్యమున "మల్లోపమల్లోపమోద్యల్లీలోల్లుఠనంబునఁ బెనఁగుచుఁ హల్లోహలోల్లోలమై" (అచలా. 1-41) అనియున్నది. ఇట "మల్లుఁడును ఉపమల్లుఁడునుబోలె పల్లటీలతోఁ బెనఁగుచు హల్లోహల యనుధ్వనితో మిక్కిలి చలించునవియై యుల్లసిల్లు తుమ్మెదలు" అనిచెప్పికొన్నచోఁ జక్కఁగ నర్థము కుదురును. ఈపద్యమున ముద్రణస్ఖాలిత్యములు 'హల్లోహలోలోలమై, అన్నచోట 'హల్లోహలోల్లోలమై, అనియు 'హల్లీసకోలానకృత్, అన్నచోట 'హల్లీసకోల్లానకృత్, అనియు 'చెల్లీను, అన్నచోట యతిభంగమైనదికాన, 'పెల్లు+ఈను' పెల్లీను, అనియు సవరించుకొనునది.

ఇఁక రంగనాథకవి ద్విరేఫవర్ణదర్పణముమాత్రము నాకులభ్యము కాలేదు. ఆపద్యము పరియగునర్థపుష్టి కలదిగాఁ దోఁపదు. కాని యీ కవి హల్లోహలశబ్దమున కర్థము గమనించి ప్రయోగించినట్లు కానరాదు.

"దయ యనెడి ప్రవహించు ప్రవాహమునంబంధ మైనకరడము యొక్క హల్లోహలధ్వనితోఁ గూడినవిజపీక్షణగుణము కలవాఁడు" అని యర్థము తోఁచుచున్నది. అనఁగాఁగృపాతరంగిత మైనవీక్షణముకలవాఁడని దీనిభావము. కాని వీక్షణగుణమునకును, కల్లోలహల్లోహలమునకును సంబంధము తృప్తిగా కుదురలేదు. కాన నిట నీయర్థ మంత సమంజసముగా లేదు. "హల్లోహలైః పగ్నోన్నిమ్నగైః" అని యాతఁడే వివరించికొనుటయుఁగూడ నీపదమునాతఁడు స్వసంకేతప్రసిద్ధార్థముగాఁ బ్రయోగించికొన్నట్లు రుజు వగుచున్నది. కాక ప్రయోగము లిట్లున్నప్పుడు తానాయర్థము వ్రాయుట కాతని కేయుపపత్తిగలదో చింత్యము. ఈ పద్యమందలి ముద్రణస్ఖాలిత్యములు "శావిక్షేత్ర' అన్నచోట యతిపోయినదిగాన 'శాలిక్షేత్ర' యనియు, 'కృపాఝులర్ఝులీ' అన్నచోట 'కృపాఝురర్ఝ్ఝరీ, అనియు సవరించుకొన్నచోఁ బద్యము సమన్వయించును. రెండవపాదమున 'ఝురీ—ఝులీ, 'రలయోరభేదః, అనుకొన్నచో యతిదోషమును లేదు.

మఱియు నీపదము "గంగాహల్లోహల, కల్లోలహల్లోహలా, ఝురీహల్లోహల" అనుచు నదీ, తరంగ, ప్రవాహార్థకపదపూర్వకముగాఁ బ్రయోగింపఁబడుటయు నీశబ్దమునకుఁ గలధ్వన్యనుకరణార్థము స్పష్టమగుచున్నది.

బ్రౌనుదొరగారు వ్రాయించినయర్థముగూడ తోఁచినరీతి వ్రాసినట్లున్నది. పాండురంగయందుఁగూడ 'వాఁడు గంగాప్రవాహమువలె నుపన్యసించుచున్నాఁడు, అను వ్యవహారమును బట్టి వ్రాయఁబడినట్లు తోఁచెడిని. అచలాత్మజాపరిణయవ్యాఖ్యాకర్తలుగూడ, ఉల్లోలశబ్దము

ననుసరించి ముందున్న హాల్లోహాలకు మత్తత యనునర్థము గుడికిబొత్తెఁడు హెచ్చుతగ్గుగఁ వ్రాసినట్లున్నది.

కాఁబట్టి యీపద మనుకరణార్థక మగుటను, ఎవ రెట్లనుకరించిన నట్లే దాని స్వరూపము మారఁ దీలుండుటను, దేవభాషాకవు లెవ్వరును దీనిని వాడియుండమిని, సంస్కృతనిఘంటువులు దీనిని జూపియుండలే దని యనుకొనవచ్చును. ప్రసిద్ధముగా నున్నమనుచరిత్ర పద్యమునకు వేఱుగా నర్థము చెప్పఁబడియుండుటచేతను, ప్రాచీనప్రయోగములు ప్రసిద్ధముగా గానరామిని, విరళముగా నున్నవైనను దృష్టిలోఁ బడకను అనుకరణశబ్దములకు భాషలో నంతప్రాముఖ్యము లేకుండుటను మన తెనుఁగునిఘంటుకర్తలుగూడ దీనిని పరిత్యజించియుందురని నాయూహ.

ఇఁక రంగనాథకవి పద్యమున, 'ఝుల ఝ్ఝలీ' అనునది 'ఝురత్ = ప్రవహించుచున్న, ఝురీ=ప్రవాహము, అని అర్థసిద్ధికొఱకు సవరించికొన వలసియుండుటచే 'ఝుల ఝ్ఝలీ, పదముగూడ నిచట సరియైనది కాదనియుఁ దెలిసెడి. ఇంకను విజ్ఞులు పరిశీలింతురు కాక.

క ఱ వు మొ ఱ.

అకుండి వెంకటశాస్త్రి

శా. కట్టా! యెంతటిఘోరకాల మిది; భిక్షల్ వెట్టఁగా దాతకుం
బుట్టె న్భీతి; ధనాఢ్యుఁ డైనవఁడె పెంపు ల్మాని దీపంబులన్
బెట్టం జాలక యంధకారజలధిన్ నిర్మగ్నుఁ డై యుండె; నీ
విట్టుల్ సూచియు నూరకుండుట ఘనంబే? వ్యాసనారాయణా!

శా. జంకుం గొంకును లేక వర్తకులు స్వేచ్ఛామూల్యము ల్వెట్టుటన్
డంకంబుల్ దమయొద్ద లేనిజను లేద్వారన్ వస్త్ర మన్నంబు నే
వంకం జూచినఁ గానరా దకట! యెవ్వా రైన నన్నార్తు లి
ట్లింకం బింకము వీడకుండు రిది మే లే? వ్యాసనారాయణా!

శా. చేరల్ నిండఁగఁ ద్రావునూనె యర సూసీ రమ్మె రూపాయి కే
వారం జూచిన వెండి కన్పడదు దేవా! కోడిగ్రుడ్డంతబం
గారంబే కఱవా? యటంచు మదిలో గర్వించి జీవించువా
రేరీ? హేమ సువర్ణ మెచ్చటికొ? తండ్రీ! వ్యాసనారాయణా!

శా. అయ్యో! భాగ్యము లొక్కటొక్కటియె క్షీణావస్థపాలయ్యెడిన్
'బియ్యం' బన్నపదంబె సున్న యగుచుండెన్ జూడఁగా, నంబరం
బయ్యెన్ వస్త్రము, హెచ్చు దేనికిని లే దాగాని యూఱన్న దే
డయ్యెంగా నొకగంట తగ్గులకు హెచ్చై, వ్యాసనారాయణా!

మ. మొదలే లేక దరిద్రుఁ డేడ్చె నిద మోహముం జేర్చె, యార్జించిన
ట్టిది ఖర్చమ్మెకు రెట్టిగా నడుచు నేడ్చెన్ మధ్యముం, దిప్పు తాఁ
బదిమానమ్ములనుండి నందులను నింకన్ లేదటం చేడ్చె లో
భదశాపిష్టుఁడు, మూఁడు నొక్కటియె దేవా! వ్యాసనారాయణా!

మ. అవురా! కాలవికార మెట్టిదొ, యవశ్యప్రాశ్యనిస్సారవ
స్తువులం దెయ్యది కోరి పోయినను నిస్తుల్యవ్యయప్రాప్త మ
య్యె, విశేషం బిఁక నేమి యన్న, జను లెంతేఁ గోరు ప్రాణమ్ములోఁ
జవుకై కానికి మాఱఁగాఁ దొడఁగెఁ గృష్ణా! వ్యాసనారాయణా!

మ. అహహా! వస్తువు నమ్మువానిమది నన్యాయమ్ముగాఁ బుట్టి ప్ర
త్యహమున్ గంటకు గంటకున్ బెరుగుదా రాశ్యమ్ము, తత్రత్యకు
ర్వహభేదంబును, దానిచేఁ గలుగుతద్వ్యవహారిపాపమ్ము గా
ఢి హరీ! మూఁడును మిన్ను ముట్టెడును దండ్రీ! వ్యాసనారాయణా.

శా. నీ వాభారత మెందు వ్రాసితివొ? తండ్రీ! నీచరిత్రమ్ము భ
క్త్యావేశమ్మున వ్రాయఁ గాగితము శూన్యం బయ్యె; విద్యార్థివి
ద్యావిజ్ఞానపరీక్షయున్ ముఖకరీత్వాకారముం దాల్చె, న
య్యో! వార్తాశ్రవణ మ్మిఁకెట్టు లగునొక్కో? వ్యాసనారాయణా

సర్వజ్ఞ సింగభూపాలుఁడు-పోతన.

చిలుకూరి పాపయ్యశాస్త్రి.

ఈప్రభువరునకు సంబంధించిన కృతులను గూర్చియు, చారిత్రకాంశములను గూర్చియు నీవఱకు నాయూహాకొలఁది గొంత చర్చించియుంటిని. ఇప్పు డొకయంశమును మాత్రము చెప్పఁబూనినాఁడ. అది యేదియన రసార్ణవసుధాకరము, సంగీతసుధాకరము, రత్నపాంచాలిక, కందర్పసంభవము మున్నగు బహుగ్రంథముల కర్తలును, సాహిత్యసర్వజ్ఞులును, కవిపండితాదరణపరాయణులు నగుసర్వజ్ఞసింగభూపాలవరేణ్యులతో బమ్మెరపోతనామాత్యున కేపాటియు సంబంధము లేదనియుఁ దన్మూలమున శ్రీనాథ పోతన లిద్దఱు సమకాలికులు గారనునదియును.

రసార్ణవసుధాకరాదిగ్రంథకర్త లగుసింగభూపాలురకు సర్వజ్ఞబిరుదము లేదని విమర్శకులొక రెంత యుద్ఘోషించినను జిట్టచివర కాపండితప్రకాండున కట్టిబిరుదము స్వర్ణాక్షరములతో నెలకొనినది. ఈనడుమ నడయారులైబ్రరీవారు ప్రకటించినసంగీతరత్నాకరవ్యాఖ్యాన మగు సుధాకరమున—

శ్లో. అతిగంభీరే నిపుణే కతిపయవేద్యేత్విహ గ్రంథే
సమ్యగ్వ్యాఖ్యాకుశలః సర్వజ్ఞః సింహ(గ ?) భూపవరః.

అనుశ్లోకమునందు 'సర్వజ్ఞ' బిరుదము సుస్పష్టముగ ఛందోనిబద్ధమైనది. నేటిదనుక నముద్రితములైనచమత్కారచంద్రికయందును, అమరకోశవ్యాఖ్యయందును నీప్రభువరున కీబిరుదము నెలకొనియున్నట్లు లిదివఱకు వ్రాసియుంటిని*.

నేటివఱ కీసింగభూపాలురకు 'సర్వజ్ఞ' బిరుదము స్పష్టముగ నుపలబ్ధముకాకకారణమున శ్రీనాథుఁ డీప్రభువరుని దర్శించెననుటకు విమ

*చూ. ఆంధ్రసాహిత్యపరిషత్పత్రిక సం. ౧౦. సం. ౨. ౩.
,, సం. ౧౧. సం. ౩. ౪.

ర్యకలోకము వెనుకంజవేసి పడరానిపాట్లు పడుచువచ్చినది. కవిసార్వభౌమ బిరుదభూషితుఁడును, వేమభూపాలునాస్థానమున విద్యాధికారిగా వెలసినవాఁడును, తర్క-వ్యాకరణాదిబహుశాస్త్రవేత్తయు నగు శ్రీనాథుఁ డివ్వనియాస్థానికిఁ బోయి "దీనారటంకాలఁ దీర్థమాడించితి" ఇత్యాదిగ శారదాదేవిని స్తుతించినఁగాని నిగ్రహింపఁజాలఁడయ్యెనో, యట్టిప్రభువ రేణ్యుఁడు సాక్షాచ్ఛారదామూర్తియై యుండవలెనుగదా ? అట్టి శారదామూర్తిత్వము రసార్ణవసుధాకరకర్తలకే గలదని సమకాలికులగు సంస్కృతకవులు వేనోళ్ల నుద్ఘోషించియున్నారు. మఱియుఁ జమత్కారచంద్రికయందలి యీక్రిందిశ్లోక మీభూపాలునివాగ్వైఖరి యనల్పసాహిత్యశిల్పావధి యని యెఱిఁగించుచున్నది.

శ్లో. సంగీతక్రమచంక్రమప్రియసఖీ శృంగారసంజీవనీ
సౌజన్యద్రుమసారణీ సరసతాసామ్రాజ్యసింహాసనమ్.
శ్రీసింగక్షితిపాలశేఖరమణే ర్వైయాత్యఘంటాపథ
శ్చాటువ్యాహృతివైఖరీ విజయతే సాహిత్యశిల్పావధిః.

సంగీతరత్నాకరసుధాకరము, రసార్ణవసుధాకరము, కందర్పసంభవము, రత్నపాంచాలిక మున్నగు గ్రంథముల నీసింగభూపాలుఁడు రచించెననియు నీశ్లోకమున సూచితమగుచున్నది.

రసార్ణవసుధాకరమునందలి యీక్రిందిశ్లోక మాప్రభువరుని సౌజన్యమునకుఁ దార్కాణము.

శ్లో. నేదానీంతనదీపికా కిము తమస్సంఘాత మున్మూలయేత్
జ్యోత్స్నా కిం న చకోరపారణకృతే తత్కాలసంశోభినీ
బాలః కిం కమలాకరాన్ దినమణి ర్నోల్లాసయే దఞ్జసా
త త్త్వం ప్రత్యపి మాదృశామపి వచ స్స్యాదేవ సత్ప్రీతయే.

సర్వజ్ఞబిరుద మీప్రభువరునకు లేదనుకొనియే (వెలుగోటి వంశచరిత్రము ననుసరించి) పదవతరమునాఁటిసింగభూపాలుని కాలమును వెనుకకును,

రసార్ణవసుధాకరకర్తలకాలమును శ్రీనాథునికిఁ బూర్వమునకును నెట్టి
యున్నారు. కాని యీప్రభువరుఁడు చిరకాలము రాజ్యము పాలించినట్టు
లీశ్లోకము చాటుచున్నది.

శ్లో. అథ శ్రీసింగభూపాలో దీర్ఘాయు ర్వసుధా మిమామ్
నిజాంసపీఠే నిర్వ్యాజం కురుతే సుప్రతిష్ఠితామ్

కావున నీప్రభువరుఁడు రాజ్యపరిపాలన మొనర్చినకాల మిదమిత్థమని
నిర్ణయింప నలవిగాదు. అదియునుగాక యీరేచెర్లవంశజులగుప్రభువులు
చిరకాలము జీవించినట్లు వారికుమారబిరుదములే సాక్ష్యము నిచ్చు
చున్నవి. అనఁగాఁ దాతలు చిరంజీవులై రాజ్యము పాలించుచుండ తుల్య
నామములు గలమనుమలును పెద్దవారయి విద్యాశౌర్యముల వాసి
కెక్కి యుండుటచేతనే యీబిరుదములు లభించియుండును. కావుననే
రసార్ణవసుధాకరకర్తయగుసింగభూపాలుని,

"కుమారశ్రీసింగే జలధి రశనాం శాసతి మహీమ్"

అని చమత్కారచంద్రికలో విశ్వేశ్వరకవి పేర్కొనినాఁడు. అమరకోశ
వ్యాఖ్యయందు బొమ్మకంటి అప్పయార్యుఁడును,

"కుమార సింగభూపేన లక్ష్యలక్షణవేదినా"

అనియున్నాఁడు.

ఇటులనే బమ్మెరపోతనామాత్యుఁడు తాను రచించినభోగినీ
దండకమున నుదాహరించినసింగభూపాలుని "కుమారాన్నపోతావ
నీనాథసూనున్" అని పేర్కొనినాఁడు. కుమారాన్నపోతావనీనాథుఁ
డనఁగా రసార్ణవసుధాకరకర్తయగు సింగభూపాలుని కుమారుఁడగు అన
పోతావనీనాథుఁడు. తాతగారగు అనపోతావనీనాథుఁడు జీవించియుండ
మనుమఁడగు అనపోతావనీనాథుఁడును ప్రసిద్ధిగాంచి యుండుటచే, తొ
లుత నేర్పడినయీకుమారబిరుదమే తరువాత వ్యవహారములోఁ బ్రసిద్ధి
కెక్కియుండఁదగు. సింగభూపాలుఁరు, అనపోతనాయకులు పెక్కురుం
డుటచే వంశక్రమ మిటఁ బొందుపఱచుచున్నాఁడను.

దాచభూపతి
|
సింగము
|
అనపోత — మాధవ
|
సర్వజ్ఞసింగ (రసార్ణవసుధాకరకర్త)
|
అనపోత — దాచ — వల్లభ — వేదగిరి — దామ — మాధవ
|
సర్వజ్ఞసింగ

కావున భోగినీదండకమునఁ జెప్పఁబడిన సర్వజ్ఞసింగభూపాలుఁడు రసార్ణవసుధాకరకర్తలమనుమఁడే యగును గాని సుధాకరకర్త యగు సింగభూపాలుఁడు కానేరఁడు. మఱియు నీయంశము 'రావుసింగక్షమానాథపౌత్రున్' అనుదండకమునందలివిశేషణము బలపఱుచుచున్నది. ఎట్లన శ్రీనాథ విరచితము లని ప్రసిద్ధికెక్కిన-

సీ. దీనారటంకాలఁ దీర్థమాడించితి
దక్షిణాధీశుముత్యాలశాలఁ
బలుకుతోడై తాంధ్రభాషామహాకావ్య
నైషధగ్రంథసందర్భమునను
బగులఁగొట్టించి తుద్భటవివాదప్రౌఢి
గౌడడిండిమభట్టుకంచుఢక్కఁ
జంద్రశేఖరక్రియాశక్తి రాయలయొద్దఁ
బాదుకొల్పితి సార్వభౌమబిరుద

గీ. మెటుల మెప్పించెదో నన్ను నింకమీఁద
రావుసింగమహీపాలు ధీవిశాలు
నిండుకొలువున నెలకొనియుండి నీవు
సకలసద్గుణనికురుంబ శారదాంబ.

క. సర్వజ్ఞ నామధేయము
శర్వునకే రావుసింగజనపాలునకే
యుర్వింజెల్లును నితరుని
సర్వజ్ఞం డనుట కుక్క సామజ మనుటే.

ఉ. తక్కక రావుసింగ వసుధాధిపుఁ డర్థుల కర్థమిచ్చుచో.

ఇత్యాదిపద్యత్రయమునందు రావుసింగమహీపాలుఁడు పేర్కొనఁబడి నాఁడు. ఈతని మనుమఁడగు సింగభూపాలుఁడుగదా కావలయును దండకమునఁ బేర్కొనఁబడిన సర్వజ్ఞుఁడు. మఱియు దండకమునఁ బేర్కొనఁబడిన సర్వజ్ఞసింగభూపాలుఁడు రసార్ణవసుధాకర్తల మనుమఁ డని విమర్శకులుఁ నిశ్చయించియే యున్నారు. ఈతఁడే రావు సింగక్ష్మానాథపౌత్త్రుఁడును కుమారాన్నపోతావనీనాథసూనుఁడును. శ్రీనాథుఁడు దర్శించినసర్వజ్ఞుఁడు రావుసింగమహీపాలుఁ డనఁబరగి సర్వజ్ఞబిరుద భూషితుఁడై నరసార్ణవసుధాకరాదిగ్రంథకర్తయే యగును. విద్యావైభవమునఁగాని రాజ్యప్రాభవమునఁగాని శ్రీనాథుఁడు దర్శింపఁదగిన యర్హత మనుమనియం దున్నట్లు దెలుపుదృఢతరప్రమాణముగానరాదు. విద్యాప్రాభవముల నరకుగొనక రావుసింగక్ష్మానాథ సర్వజ్ఞ బిరుదము లున్నంతమాత్రాన నీమనుమనితో సంబంధమేర్పఱుచుట సంగతమును గాదు. కావున తాతయగు సర్వజ్ఞసింగభూపాలునితో శ్రీనాథునకును, మనుమఁడగు సర్వజ్ఞసింగభూపాలునితోఁ బోతనకును సాహితీసంబంధమేర్పడుచున్నది. ఇట్లుచూడ నీయిరువురనడుమ రెండుతరములకాలవ్యవధానము గానవచ్చెడిని. అనఁగాఁ బోతన శ్రీనాథునకు నలువదిసంవత్సరములు తరువాతివాఁ డగును.

ఒకపక్షమున శ్రీనాథుఁడు పేర్కొనిన రావుసింగక్ష్మానాథుఁడును, దండకమునఁ బేర్కొనఁబడిన రావుసింగక్ష్మానాథుఁడును భిన్నులేయందురా? అపుడు 'కుమారాన్నపోతావనీనాథసూనుఁ' అనునది పొసఁగదు. ఈయుభయవిశేషణములపర్యాలోచనముచే శ్రీనాథుఁడు దర్శించినసర్వజ్ఞుఁడు రసార్ణవసుధాకరకర్తయు, పోతనదండకమునందు దాహృతుఁడైన సర్వజ్ఞుఁ డాతనిమఁడేయని నిశ్చయింపవచ్చును.

మఱియుఁ బోతనకు సర్వజ్ఞసింగభూపాలునితోఁ గల పరిచయమును దెలుపుచు నాతనికాలనిర్ణయమునకుఁ బ్రధానసాధనముగ నెన్నఁబడినగ్రంథము భోగినీదండకము. ఇందు వేఱొకచో 'పోచమాంబాలసద్గర్భసంజాతుపై' అని కలదు. ఈయంశమును నిందలిసర్వజ్ఞుఁడు రసార్ణవసుధాకరకర్త గానేరఁ డని నిశ్చయించుచున్నది.

శ్లో. అన్నమాంబేతి విఖ్యాతా తస్యాసీ ద్ధరణీపతేః
దేవీ శివా శివస్యేవ రాజమాళే ర్మహోజ్జ్వలా.

అనురసార్ణవసుధాకరశ్లోకమును బట్టి రసార్ణవసుధాకరకర్త తల్లిపేరు అన్నమాంబ. రత్నపాంచాలికయందలియీక్రిందిగద్యమును బట్టియు నిట్లే తెలియనగును.

"లలితకవితావిలాసచతురాననేన ... మాన్యమహిలాగుణవిశేషలీలాసదనోమాంబికా విదూర విశ్వంభరా విమలరత్నకందళేన శ్రీమతా శ్రీసింగభూపాలేన ప్రణీతా ..."

రత్నపాంచాలికా- ఆముఖమ్.

దండకమునందలిసింగభూపాలునితల్లిపేరు పోచమాంబ. ఇట్లు మాతృనామవ్యత్యాసమును బట్టి చూచినను పోతనకును రసార్ణవసుధాకరకర్తలగు సర్వజ్ఞసింగభూపాలురకును ఎంతమాత్రము సంబంధము లేదనుట నిశ్చితము.

భీమఖండమునందలి యీక్రింది పద్యమునకును, భాగవతమునఁ బ్రహ్లాదచరిత్రమునందలి యీక్రిందిపద్యమునకును విశిష్టసామ్యము గాన

వచ్చుటయు పోతన శ్రీనాథునకుఁ దరువాతివాఁ డని తెలియఁజేయు
చున్నది.

సీ. శ్రీభీమనాయకశివనామధేయంబుఁ
            జింతింపనేర్చినజిహ్వ జిహ్వ
    దక్షవాటీపురాధ్యక్షమోహనమూర్తిఁ
            జూడంగనేర్చినచూపు చూపు
    దక్షిణాంబుధితటస్థాయిపావనకీర్తి
            చే నింపనేర్చినచెవులు చెవులు
    తారకబ్రహ్మవిద్యాదాతయౌదల
            విరులు పూన్పఁగ నేర్చుకరము కరము
గీ. ధవళకరశేఖరునకుఁ బ్రదక్షిణంబు
    సల్పఁ దిరుగంగ నేర్చినయడుగు లడుగు
    లంబికానాయకధ్యానహర్ష జలధి
    మధ్యమునఁ దేలి సొలసెడిమనసు మనసు.
సీ. కమలాక్షు వర్ణించుకరములు కరములు
            శ్రీనాథువర్ణించు జిహ్వ జిహ్వ
    సురరక్షకునిఁ జూచుచూడ్కులు చూడ్కులు
            శేషశాయికి మ్రొక్కు శిరము శిరము
    విష్ణు నాకర్ణించువీనులు వీనులు
            మధువైరిఁ దవిలినమనము మనము
    భగవంతు వలగొనుపదములు పదములు
            పురుషోత్తముని మీఁదిబుద్ధి బుద్ధి
గీ. దేవదేవునిఁ జింతించుదినము దినము
    చక్రహస్తునిఁ బ్రకటించుచదువు చదువు
    కుంభినీధవుఁ జెప్పెడిగురువు గురువు
    తండ్రి హరిఁ జేరు మనియెడితండ్రి తండ్రి.

వెలుగోటివంశచరిత్రమునందును వెలుగోటివారివంశావళియందును లెక్కించినరీతిని దండకమునందలి సర్వజ్ఞసింగభూపాలుఁడు పదవతరమువాఁడగును. రసార్ణవసుధాకరమునందుదాహృతమైనవంశావళియే శాసనములకు సరిపడునదియై యున్నది. సుధాకరమునందలివంశావళికి సంబంధించినశ్లోకములు కొన్ని చమత్కారచంద్రికయందు నుదాహరింపఁబడినవి. ఇట్లు గ్రంథస్థములై శాసనములతో సరిపడుశ్లోకముల యాధారమునఁ గాంచినను రసార్ణవసుధాకరకర్తలకుఁ బోతనతో నేపాటియు సంబంధము లేదని సుస్పష్టము.

ఈప్రభువరుఁడు రచించినరసార్ణవసుధాకర, సంగీతసుధాకరములీవఱకే ముద్రితములైనవి. ఈనడుమ శ్రీశ్రీశ్రీ పీఠికాపురాధీశ్వరులీప్రభువరుఁ డనల్పశేముషీవైభవముతో రచియించిన 'రత్నపాంచాలిక' యనునాటకము నాంధ్రానువాదముతోడను, విపులమగు పీఠికతోడను గూర్చి ప్రకటించి యాప్రభువరేణ్యులయెడలఁ దమకుఁగలకృతజ్ఞతాభరమును వెల్లడించియున్నారు. ఇంకను నాకవివరేణ్యునికృతులన్నియు మఱుఁగువిడి నేఁడో రేపో సారస్వతరంగమున వెలువడుననుట నిశ్చితము. కాని యాప్రభువరునాస్థాని నుండినవిశ్వేశ్వరకవి యాప్రభువున కంకితముగ నొసఁగినచమత్కారచంద్రిక వెలువడిన యాఘనప్రభునికీర్తి యితోఽధికముగ లోకమున వన్నెకెక్కఁగలదు. విద్యానాథవిరచితమగు ప్రతాపరుద్రయశోభూషణము వెలువడుటచేఁ బ్రతాపరుద్రునికీర్తి భారతావని నెల్లెడల వ్యాపించినట్లు లీచమత్కారచంద్రికాప్రసారముచే సర్వజ్ఞసింగభూపాలునియశశ్చంద్రికలు దేశమెల్లెడ వ్యాపించి యాప్రభువరునిఁ గూర్చినయనేకనూతనాంశముల నందీయఁగలవు. కావున భాషాపోషకులగుప్రభువరులీకార్యభరముఁ గైకొందురుగాక యని సవినయముగ నివేదించుచున్నాఁడను.

గ్రంథస్వీకారము.

1. ద్విపదభారతము:—ఆది సభాపర్వములు- తిమ్మయ్య, బాలసరస్వతులు రచించినది. పరిష్కర్తలు శ్రీ పింగళి లక్ష్మీకాంతముగారు. ఆంధ్రవిశ్వకళాపరిషత్ప్రకటితము.

ద్విపదభారతమును తిమ్మయ, సోమన, బాలసరస్వతి యను కవిత్రయము రచించెను. అందు నాదిపర్వము మొదలు ద్రోణపర్వమువఱకు సభాపర్వముదక్క మిగిలిన పర్వముల నాఱింటిని తిమ్మయయు, సభాపర్వము బాలసరస్వతియు, మిగిలిన పర్వములను సోమనయు రచించిరి. వీరు 16 వ శతాబ్దాంతముననో 17 వ శతాబ్దముననో యుండియుందురు. ఆంధ్రవిశ్వకళాపరిషత్తునందు ఆంధ్రోపన్యాసకులగు శ్రీ లక్ష్మీకాంతముగారు గ్రంథమును బరిష్కరించి విపులమగు పీఠికతో నీగ్రంథభాగమును బ్రకటించిరి. ఇట్టి గ్రంథముల ముద్రించుటకు విశ్వకళాపరిషత్తు వంటి సంస్థలకే వీలగును. పరిష్కర్తలు విపులమగు పీఠికను జేర్చి, యందు గ్రంథకర్తల కాలము, కవిత్వలక్షణములు మున్నగువానిని జర్చించిరి. ఇదమిత్థమని నిర్ణయించుటకు వీలు కలుగకపోయినను తిమ్మనకాలము క్రీ. శ. 1600 లకుఁ జేరువగ నుండునని యూహింపఁబడినది. బాలసరస్వతి యతని శిష్యుఁడనియు నతనియందలి వాత్సల్యముచే సభాపర్వ రచన మాతనికీయఁబడెననియు నూహింపబడినది. సోమన కర్ణపర్వము మొదలుగ నాగ్రంథాంతము రచించుటయేగాక తిమ్మయ క్లుప్తముగా రచించి విడిచిన యరణ్యపర్వమును విపులీకరించెను. ద్విపదరచనమునకు వాఙ్మయమునఁ బ్రత్యేకస్థానము గలదు. సామాన్యజనులకు సులభముగఁ దెలియునటుల చిన్నమాటలతో రచింపఁబడి యొకప్పుడు గానమునకుఁ గూడ ననుకూలముగ నుండును. పద్యకవిత్వమునఁ గల ప్రౌఢశైలియు, వర్ణనాచమత్కారములు మొదలగునవి కొఱవడినను, చదువుట కింపుగా మృదుమధురముగ రచింపఁబడు ద్విపదకావ్యములుగూడ నున్నతస్థానమును వహించుచున్నవి. రంగనాథుఁడు, గౌరన, మున్నగువారి రచనలిందుకు తార్కాణములు.

ద్విపదభారతము మూలమునకు యథామాతృకము గాదు. కొన్నియుపాఖ్యానములు కథలు విడువఁబడినవి. సంభాషణాచాతుర్యము, రమణీయ మగుకథాకథనము, ప్రబంధవర్ణనములతో సమకూర్పఁబడియున్నవి. గ్రంథకర్తల వ్యాకరణవిశేషములు, క్త్వార్థక, తత్సమస్త్రీవాచకసంధులు, కలహార, ప్రయము మొదలగు వింతశబ్దములు, సర్పపేరు, కళ్యాణపీట మొదలగు వైరిసమాసములు మున్నగువానిని గూర్చి విపులముగ పీఠికయందు వివరింపఁబడినది. ద్విపదగ్రంథముల నిట్టి లక్షణవిరుద్ధములు పెక్కులు గలవు ఇట్టిగ్రంథమును బ్రకటించి విశ్వకళాపరిషత్తువారు ఆంధ్రభాష కమూల్యమగు సేవ నొనర్చియున్నారు. మిగిలినభాగములఁ గూడ త్వరలోఁ బ్రకటించి కృతకృత్యు లగుదురుగాక. వెల రు 10-0-0 గ్రంథమున సుమారు ఏడువందల పుట లున్నను, వెల యత్యధిక మనఁ జెల్లును. తమ కెంత ధనవ్యయమైనను, విశ్వకళాపరిషత్తువా రీగ్రంథముల సామాన్యజనులకును, గ్రంథాలయములకు నందుబాటులో నుండునటుల బ్రకటింపవలయును. అట్లు విశ్వకళాపరిషత్తువారు మూల్యములఁ దగ్గించి గ్రంథప్రచారమునకుఁ దగు ప్రాముఖ్యము నొసంగుదురని యాశించుచున్నాము.

2. అష్టావక్రచరిత్రము:— కాకినాడ సూర్యరాయనిఘంటుకార్యాలయపండితు లగు శ్రీబులుసు వేంకటేశ్వర్లు, బి. ఏ. గారిచే రచింపఁబడినది. భారతమున నానుశాసనికపర్వమునఁ గలయష్టావక్రచరిత్రము నందలి శ్వేతకేతువృత్తము మూఁడాశ్వాసముల గ్రంథముగా రచింపఁబడినది. ఉచితమగు ప్రబంధవర్ణనములు చేర్పబడినవి. గ్రంథకర్త లీగ్రంథమును అష్టావక్రుని గురుభక్తి కనుగుణముగఁ దమ గురువుల కంకిత మొనర్చిరి. గ్రంథము సులభమై మృదుమధురముగ నుండునటుల రచింపఁబడినది. పెక్కు పండితాభిప్రాయములు గ్రంథప్రాశస్త్యమును విశదీకరించుచున్నవి. 'ప్రాచీనగ్రంథముల జీర్ణమగు' నాంధ్రభాషను గైకొని నూతనగ్రంథముల రచన త్వరముగ రచింప వీలగుననుట కిట్టి గ్రంథములే తార్కాణములు.

ఛందోదర్పణ సమీక్ష.

రావూరి దొరస్వామి శర్మకవి.

(అనువృత్తము.)

ద్వితీయాశ్వాసము.

(1) సమవృత్తములు-

(అ) శ్రీ, భా, విం, తుః.

(ఆ) స్త్రీ రూ, పారుః, ఘోరా, భూరీ.

(ఇ) వినయాం, బోనరిం, తునసం, తునకుః.

పై మూఁడువృత్తంబులందు గణములను జేర్కొనలేదు. పెద్దనాప్పకవులు శ్రీ వృత్తమునకుఁ దప్పక దక్కినవానికిఁ జెప్పినారు. గణములను దెల్పుటయే లక్షణమునకు ముఖ్యకర్తవ్యము.

(2) (అ) లాటీవిటవృత్తము- 102 వ పద్యము.

సగణంబులు నాల్గిటిపై మతయుల్ - సమ్యగ్భవంబై యనుదేరన్
బగలింటికి నేలిక యొవ్వఁడు నా - భావింపఁగా నయ్యె వకుల్
మిగుల స్మనురం బగుశబ్దములన్ - విశ్రాంతిన్ లాటీవిటవృత్తం
బగు నిందుకళాధరసన్నుత నా - మాంకాళంకాతంకవిదారీ.

స- స- స- స- మ- త- య గణములు, యతి 13 అక్షరము. రెండవపాదమున గణభంగ మేర్పడుచున్నది. మూఁడవపాదమున యతిభంగము (మి- వి- యతి చెల్లదు.) ఒకవేళ మకారయతి యని యెంచినచో బిందుపూర్వకవకార మగుటవలనఁగాని 'శబ్దములన్ + విశ్రాంతి' అనుచోట సంశ్లిష్టకరకం బగుక్రుతంబునకుఁ బూర్ణబిందువు రాదు; సంశ్లేష మనియే దీని నెన్నవలెను. ఇట్టిప్రయోగ మొందుకావ్యాలంకారచూడామణిలోను గలదు చూడుఁడు.

చ. లసితములైన లేఁజెమరులన్ జెలువారెడిమేసికాంతియున్
బోనఁగ విలోచనాంతములఁ బొంపిరివోయెనువింతరాగము
న్వసుమతిగారవించుచు శ్రమంపడకుండిన నేలకల్గు... (షల్లాన.44వ)

పెద్దనం జూచి కాఁబోలు ననంతుఁడిట్టి ప్రయోగము సేసియుండును. దీనం జేసి 'వర్గయుక్సరళములు పరంబులగునపు డొకానొకచో ద్రుతమునకుఁ బూర్ణబిందువును గానంబడియెడి (సంధి. 19 సూ) అను బాలవ్యాకరణసూత్రంబునకు 'సరళస్థిరంబులు పరం బగునపు' డను పాఠమును గల్పించుకొనవలసివచ్చును. ద్వితీయపాదగణభంగవిషయము ముద్రణస్ఖాలిత్యమని యెంచెదను. వసుల్ అను బహువచన మనవసరము. విశ్రాంతి యను పునరుక్తియుఁ గలదు. ఇందున్నట్లే యుంచి 'భావింపంగా నమ్యోవసుల్ దా' అని యొండె 'భావింపగా భాసురభంగిన్' అని యొండె సవరించుకొనవచ్చును. రెండవసవరణవలన యతిభంగము కూడఁ దుదినున్న ద్రుతము సంశ్లేషమగుటచేఁ దొలంగఁగలదు.

(అ) అష్టమూర్తివృత్తము-

ఈ సౌందర్య మనతయుక్తిన్ సరభజల్ యాంతమై కుంజరయతిద్వాద
మొక్కం
గా నిట్లింపెసఁగఁ జెప్పం గవిజనం బష్టమూర్తిన్ ఘనసమామ్నాయ
రీతిన్.

గణములు- మ- న- త- స- ర- భ- జ- య.

క్రిందిపాదమున గణభంగము; 'సమామ్నాయ' అని యుండుటచే మ- న- త- స- ర- భ- య- య గణములగును. ఇవి లేఖకప్రమాద మగునేమొ! 'ఘనసమాగమరీతిన్' అని సవరించుకొన్న సమీచీనం బగు.

(౩) సరసిజము.

మాళిం బిల్లంగో లొకచేతన్ మటియొకకరమున మణిమయుతనున్
బాలక్రీడల్ ప్రేమాల వసింకన్ బయల నోడిగి చనుపనగలప్రభున్
జాలం గొల్వంజాలిన కోర్కల్ సఫలములగు సన సరసిజ మమరన్
భోలన్ బ్రహ్మన్ భోగిగిరామస్ఫురదురుమతయునము లనననసలున్.

ఇందు మొదటిమూఁడుపాదములందుఁ గ్రౌంచపదవృత్తంబునకుఁ బ్రాసయతి యున్నది గాని నాల్గవపాదమునఁ దప్పి యందులకు మాఱు యతి పడియున్నది. ఇతరలాక్షణికులు చెప్పినవి ప్రదర్శించెదను.

పెద్దన-

చాళుక్య క్ష్మాపాల వరేణ్యాశ్రయ మతయననవిచయయుత ననసల్
చాలై యింపై వ్రాలఁ దనర్పన్ సరసిజ మగు విలఁ జవులకుఁ గుదురై.

భీమన-

మారాకారా చారుచరిత్రా మతమున సననన మహి యతిరచన
సారంబైనన్ సూరికవీంద్రుల్ సరసిజ మని వినఁ జదివిరి సభలన్.

పై పద్యములందును బ్రాసయతి గలదు గదా, ఇఁక నప్పకవి యన్నచో 'సంబంధించున్ మత్సలు నానానలు దశనిధియతి సరసిజము సతున్, గంబీర న్బృందాటవిలోన్ గవిసికొనిన సుర కరువలిదను జన్ ...

అను సరసిజలక్షణమునఁ బ్రాసయతి చెప్పలేదు. క్రౌంచపద వృత్తమునను సైతము భీమన పెద్ద నాఁతులు ప్రాసయతిం జెప్పిరి గాని యప్పకవి చెప్పఁ డయ్యె.

భారతము స్త్రీపర్వము ౨. ఆ. 37. వ.

సరసిజము.

శ్రీరమ్యశ్వం బారఁగఁ జెం పూర్జితముగ మణివిరచితమకుటములన్
దారుం జూపన్ పారవిభూతిన్ ధరణిపు లనిమిషధవనిభు లగుచున్
భూరిశ్రీలన్ పూరెలఁగొల్వన్ భువనవినుత మగుపోలుపు వెలయుకు
న్నీరాజుంసన్ దారుణదైవం బిటువలుమనె తుది నితనిఁ గటకటా.

ఇందుఁ బ్రాసయతి యున్నది గావున సరసిజమునకు రెండుయతు లేకాక ప్రాసయతికలిమియుఁ బ్రాచీనలాక్షణికమత మగునట్లు కన్పట్టెడి. అందుననే యనంతుఁడు ప్రాసయతిం బెట్టినాఁడు; చతుర్థపాదమున

ప్రాసభంగ మనకుఁ గారణము వ్యాఖ్యము. 'హేమ బ్రహ్మవ్యాళవిరామ స్ఫురదురు' అని సవరించిన నిర్బాధకం బగును.

(4) * అర్ధసమ విషమవృత్తములు:-

ఇవి యైదువిధములు.

(i) స్వస్థానార్ధసమము-ఒకేఛందమునఁ బుట్టిన రెండువృత్తములఁగొని సగ మొకతెఱఁగు పెఱసగ మొకతెఱఁగుగాఁ గాని, సమపాదము లొకతెఱఁగు విషమపాదములు వేఱొకతెఱఁగుగాఁ గాని వ్రాయుట. మఱియు నొకపాద మొకవిధము తక్కినమూఁడు మఱియొకవిధ ముండవచ్చు.

(ii) స్వస్థానవిషమము-ఒకేఛందమునఁ బుట్టిన నాలుగువిధములైన వృత్తములతో నాలుగు చరణములు రచించుట.

(iii) పరస్థానార్ధసమము-భిన్నచ్ఛందములకుఁ జేరినవృత్తముల రెంటిం గొని సమాంఘ్రు లొకదానితోను విషమాంఘ్రులు వేఱొకదానితోను విరచించుట.

(iv) పరస్థానవిషమము-భిన్నచ్ఛందములకుఁ జేరిన రెండు లేక మూఁడు వృత్తములఁ గైకొని యొకపాద మొకతెఱఁగు తక్కినమూఁడు వేఱొకతెఱఁగుగాఁగాని, రెండుచరణములు భిన్నభిన్నములుగాను, మఱి రెండుచరణములు వానికి భిన్నమగు వృత్తములోను చెప్పుట.

(v) సర్వపరస్థానవిషమము-భిన్నచ్ఛందములకుఁ జేరినవృత్తములతో నాలుగుపాదములందు నాలుగువిధములుగ సర్వము విపరీతముగా రచించుట. ఇఁక ఛందోదర్పణములోని కొన్ని క్లిష్టసమన్వయలు.-

(క) అంగజాస్త్రము-స్వస్థానవిషమ వృత్తమునకుఁ జేరిన దని చెప్పఁబడియె.

---

* అప్పకవి మతప్రకారము వ్రాయఁబడియె.

భూరి భమంబుల్ పొందు నగం బిం
పారఁగ నర్ధంబై యట సాధుల్
శౌరీ విస్మసజంబు గాంతనై
యారూఢం బగు సంగజాస్త్రముల్.

అనంతుఁడు పై పద్యమున నగము 'భ- మ- స- గ' గణములలోఁ బెఱనగము 'మ- స- జ- గ' గణములలో నుండు నను చున్నాఁడు. 'ఒక్క ఛందంబున నొగిఁ గొని పాదముల్ వేఱైన స్వస్థానవిషమ మ య్యె'నని యనంతుఁడే యుద్ఘోషించినాఁడు; గాని స్వస్థానార్ధసమవృత్త లక్షణము ప్రకారము వ్రాసి పై వృత్తమును విషమమందుఁ జేర్చివేసెను.

అప్పకవి యంగజాస్త్రమునకు నాల్గుచరణములందుఁ గ్రమముగా రుక్మవతి, శుద్ధవిరాటి, పణవము, మయూరసారియను ఛందముసఁ బుట్టినవృత్తములను జేర్కొనియె.

(చ) వరాంగి.

నేత్రపదాబ్జా జతజల్ గగల్ బం, ధురంబగుఁ రెంటఁ జతుర్థ కాంఘ్రిఁ
గారాముతోఁ దాజగగల్ వరాంగిఁ, హరార్చితా మూఁడవయంఘ్రి
నొందుఁన్.

ఇది 1, 2, 4 వ చరణములందు నుపేంద్రవజ్రాచ్ఛాయ, 3 వచర ణమున నింద్రవజ్రాచ్ఛాయ నడచు చున్నవి. అప్పకవిమతమున నిదియు స్వస్థానార్ధసమమే యగు నైనను అనంతుఁడు, ధరనొకటియు మూఁడును నగుచరణంబులు మఱి ద్వితీయ చాతుర్థిక విస్ఫురితాంఘ్రులుఁ దమలో నను, నేరియగు నర్ధసమవృత్తచయమునఁ గృష్ణా! యని యందలించుటచేఁ బైయభిప్రాయమునకు భిన్నం బగునిది యతనిమతమున స్వస్థానవిషమమే యగు నని యూహింపవచ్చును.

అప్పకవి దీనినే కాఁబోలు వారాంగి యనియె. దానికి వరుసగా నింద్రవజ్ర, ఉపేంద్రవజ్ర, గీతాలంబనము, వాతోర్మి యనువృత్తములు నాల్గుచరణముల నొప్పును.

(ట) నదీప్రఘోషము - ఇదియుఁ బైవరాంగివలె నున్నది.

ప్రథమచరణమున స్రగ్విణియుఁ, దక్కిన మూఁడంఘ్రులందు వంశస్థమును నడచు నని యనంతుఁడు; అప్పకవి నాల్గుచరణములఁ గ్రమముగా స్రగ్విణి, వంశస్థము, భుజంగప్రయాతము, ఇంద్రవంశము నడచు ననియె.

(ఠ) రథగమనమనోహరము - ఇది కరస్థాన విషమవృత్తము.

ఇందు 2 వ చరణము స- జ- జ- ర- య;

1, 2, 3 చరణములు న- స- ర- జ- గగ.

అనంతుఁడు-

రథగమన మనోహరంబు రెండవంఘ్రిన్
బ్రథితంబగున్ సజజంబు రప్రయుక్తయంబున్
బ్రథమపదమునందుఁ బై పదంబునందున్
గదిత నసరజంబు గద్వయంబుఁ గృష్ణా.

అప్పకవి-

గ్రథితనయుగరజ్జగంబులుం బొసంగం
బ్రథమతృతీయ చతుర్థపాదము ల్వదింకన్
విధిదశయుతు లొంది వింతగా సజార్యల్
రథగమన మనోహరంబగున్ ధరిత్రిన్.

రెండవచరణమున, 'స- జ- జ- ర- య' అనియున్నది; అనంతునికన్న నొకగణము భిన్నము. అనంతుఁడు 'న' అప్పకవి 'స'

(డ) వీణారచనము ఇది సర్వపరస్థాన విషమవృత్తము.

వీణారచనంబయ్యె భువిన్ తయసాగల్
బాణప్రహరా తజనభ భవ్యగగంబుల్
చాణూరహరా తజనభసల్ ప్రకటస్ఫురిన్
వేణుధర భసనభస విశ్రుత మగుచున్.

అనంతునిమతము.

1. త- య- స- స- గ
2. త- జ- స- భ- గగ
3. త- జ- స- భ- స
4. భ- స- స- భ- స

అప్పకవి.

1. త- య- స- స- గ
2. త- జ- స- భ- గగ
3. త- జ- స- భ- స
4. భ- స- స- జ- స- గ

పెద్దన (విన్నకోట)

1. త- య- స- స- గ
2. త- స- స- స- గగ
3. త- జ- స- భ- స
4. భ- స- స- జ- ర.

పెద్దన (చిత్రకవి)

1. త- య- స- స- గ
2. త- జ- స- భ- గగ
3. త- జ- స- భ- స
4. భ- స- స- జ- స- గ.

ఇట్టి పరస్పరభేదము లున్నను అప్పకవి లక్షణము నాల్గుపాదము లందు నాల్గు భిన్నచ్ఛందముల నుండి కలిగిన వృత్తములలోఁ గన్పట్టెడి. అనంతామాత్యునకు నాల్గవపాదమునఁ గొంతభేదము గనఁబడుచున్నది. మీఁదుమిక్కిలి తృతీయచతుర్థచరణములందు నొకేఛందమునఁ బుట్టిన వృత్తము లున్నవి. ఎట్లు నొకేఛందమునఁ బుట్టినను భిన్నవృత్తము లగుటచే నవియు వేఱే యగు నని భావించి యనంతుఁడురచించియుండును. అవి రెండు సమానగణములు గలవృత్తమైనచోఁ బరస్థానవిషమ మగును; అట్లు లేదుగాన నిదియు సర్వపరస్థానవిషమవృత్తము కావుట సమంజస మనియే యంగీకరింపవచ్చు. గణములభేదమునకుఁ గారణము తాళపత్రంబులం దక్షరము లోపించుటచేతనో శిథిల మగుటచేతనో యయియుండును.

(5) దండకము.

సిరి నేలు రసికుంఛు శ్రీవత్సవత్సుండు... ... ...
పెద్దల్ సకారంబుతో సంగతంబై నహం బాది నొండేని, దకారాదిగానైన లోనెల్లచోటం దకారంబులం బెల్లుపొందన్ గకారావసానంబునై దండకాకార మేపారఁ గీర్తింతు రెల్లప్పుడున్. (135 పద్య)

ఈలక్షణముచే ససహాలతో వరుసగాఁ జేర్చి కాని, లేక తగణముతోఁగాని యారంభింపవలయు ననునపార్థము సంభవించును. అట్లే :— సిరి నేలురసికుండు అను ప్రారంభము తెల్పుచున్నది. ఇట్లనంతుఁడు లిఖించుటకుఁ బెద్దనభీమనలు, కారణభూతులుగాఁ దోఁచెదరు.

కావ్యాలంకార చూడామణి.—

'కృతి నాది ససహంబు లొండెం దకారంబు లొండెం బ్రకల్పించి ……………' (అచ్చులో ససహంబు లని యున్నది గాని యుదాహరణప్రకారము ససహము లనియే యుండును)

భీమన 'అమరంగ సఃహంబులం బాదిగా నొండెఁ గాదేని యాదిం దకారంబుగా నొండె … …' అని వ్రాయుటయు, లక్ష్యమును ససహాలతో మొదలు పెట్టుటయు నీసంశయమునకు హేతువై యనంతుని భ్రమింపఁ జేసియుండును. ససహాలలో నేగణములోఁగాని యారంభింపవచ్చు; లేదా తగణ ముంపవచ్చు. అప్పకవి 'విద్వాంసులెల్లఁ హకారంబె కానీ సకారంబెకానీ సకారంబెకానీ వచింపం దగు సన్మంత్రముగా నిందుఁ గాదేని యాదిం దకారంబుగల్పించి… … … …'అని చెప్పెను తృతీయాశ్వాసము.

(1) ఎత్తుగీతి-

అదిప్రాసంబు హరియు, నాదిత్యయుగము సగుచు
నీదెన యతుల గెత్తు, గీదియు నెగడుఁ గృష్ణ.

దకారప్రాసనిర్బంధముచే గీతిశబ్దమునకు మారుగా గీది యుండ వలయు.

'సూ॥ ద స్తస్య శౌరసేన్యా మఖావచోస్తాః; వృ- అనాదేర చః పర స్యాసం యుక్తస్య తకారస్య దః స్యా చ్ఛౌరసేన్యామ్' అను సూత్రముచే నప్పకవి మత మనుసరించి యిది గీతి శబ్దమునకు శౌరసేని భాష నైనతద్భవము గాఁగలదు. గీది + అ = గీదియ-ఏవార్థకముగా అకారమును బరిగణింపవలె. గీదియు యను శబ్దమే వికృతి యని చిహ్నము

నకుఁ జెన్నియు'వర్ణము నకు వన్ని మవలెను గ్రహింపవచ్చును. గీదిశబ్దంబు శబ్దరత్నాకరాది నిఘంటువులందుఁ గానరాదు. శబ్దరత్నాకరకారుఁడు తానొనంగిన గృహీతగ్రంథంబులందు ఛందోదర్పణమును వ్రాయకుంటం జేసి యతని కీపదమును గ్రహించుట వీలుపడదయ్యె నని యెంచ నగును. అనఁగా నతఁ డీపదమును జూడలే దని భావము.

(2) తరువోజ

ముగురుజిష్ణులు త్రయీమూర్తియు మఱియు ముగురుజిష్ణులు త్రయీమూర్తియుఁ గూడి
యొగిఁ జుండ గిరియతి యొక్కొక్కచరణ మునుఁగక సేవింప నుజ్జ్వలంబగుచు............

ఇందు గిరియతియనఁగా నేమియర్థమో ! రెండు రెండుగణముల పై మూఁడుచోట్ల యతు లుండవలయు నని తరోవ్జలక్షణము "ఒగి రెంట యతులు మూఁ డొక్కొక్కచరణ మునుఁగక" యని సవరించుకొన్నఁ గొంత మే లని తోఁచెను.

(3) త్రిపద.

సరవిఁ బ్రాసము నొంది సురపతు ల్నలువురు,
హరియు నైకార్కులు గలియు,జరఁగ నిప్పగిది నొప్పుఁ ద్రిపద.

ప్రథమపాదమున 4 ఇం, ద్వితీయమున 2 ఇం × 1 సూ, అట్లే తృతీయము. అట్లైన తృతీయపాదమున గణభంగ మేర్పడుచున్నది 'జరగు నిప్పగిదినై త్రిపద' అనుపాఠమును జేర్చుకొన్న నిర్బాధకంబగు. ఛందోదర్పణమూలమునఁ గలతప్పొప్పులపట్టిక యందు 'జరగు నిప్పగిది నొప్పుఁ ద్రిపద' రెండుసమాపకక్రియ లుంటచేనేమో తప్పని, 'జరగ నిప్పగిది' యొప్పుగా దిద్దిరి గాని యీగణభంగమును గమనింపరైరి.

త్రిపదం గూర్చి భీమనపెద్దనలు భిన్నములుగా లక్షణములం జెప్పిరి ఇం దొక్కచోటనే కాక యనేకస్థలంబుల భీమనపెద్దనల లక్షణము భిన్నముగాఁ గన్పట్టెడిఁగాని వారివిషయంబులం గూర్చి యొండొకయెడ విస్తారంబుచర్చింపఁ దలఁచితిని గాన నక్కార్యము నిందు మానెదను.

(4) చౌపదము.

కలసి చతుర్లఘుగణములయందు
నలిఁ ద్రిగణంబై నగణము వొందు
నలరు గణద్వయయతి గోవిందుఁ
బలుకఁ గృతులఁ జౌపద చెలువందు.

ఇందుఁ జతుర్లఘుగణత్రయముపై నగణము వ్రాయవలె నఁట, లక్షణమునఁ జెప్పకున్నను నంత్యప్రాస మున్నది. భీమనపెద్దనలు చతుర్లఘుగణములు (భ- స- గా- నల) నాలు గుండవలె నని యంత్యానుప్రాసంబుతో విధించిరి. అప్పకవి భీమనపెద్దనల మత మనుసరించి గణములం జేర్కొని యంత్యానుప్రాసమును మాత్రము పరిత్యజించెను. అనంతునిది వీనికి భిన్నముగా నున్నది. (చతుర్లఘుగణములందుఁ ద్రిగణంబు+ఐ, నగణము వొందు నని పై పద్యమున కర్థము చెప్పవలె; నలిత్రిగణముపై నగణము వొందు ననినచో సుగమముగా నుండు నని నాయాశయము) మఱి యిందు నగణ మని లక్షణమునఁ గలదు. లక్ష్యమున హగణ మున్నది. సూర్యగణ మన్నచో నిర్బాధకం బగును.

(5) వితాళచౌపద.

అర్కనామగణ మనువుగ రెండు, దార్కొని లఘువొందఁగ నిట్లుండు
దర్కింపఁగను వితాళమునందుఁ, జేర్కొనఁ దగు హాలిబిరుదులపిండు.

ఇందుల కర్థము విచార్యము; ఇట్టిది యప్పకవీయమున నొందున్నది, దానియర్థమును విచార్యమే.

భానుయుగముపై నయినవలనిం,పూన మణివిరతి నొంది ధరలో
బానలరుఁ జతుష్పదవి తాళా,ఖ్యానము నవి నాయకతురంగా.

అనంతునిలక్షణ మున్న తెఱఁగరయుఁగాఁ బంచదశలఘువులు గల గణము లొకపాదమునఁ గలది యని తెలియవచ్చెడి. యతి తొమ్మిది లఘువులపై నున్నది. అనంతునిపద్యమున నంత్యానుప్రాసము గలదు గాని మూఁడవపాదమున తకారమునకు మాఱు దకార మున్నది. దీనిచే దడ

(4) చౌపదము.

కలసి చతుర్లఘుగణములయందు
నలిఁ ద్రిగణంబై నగణము వొందు
నలరు గణద్వయయతి గోవిందుఁ
బలుకఁ గృతులఁ జౌపద చెలువందు.

ఇందుఁ జతుర్లఘుగణత్రయముపై నగణము వ్రాయవలె నఁట, లక్షణమునఁ జెప్పకున్నను సంత్రాస మున్నది. భీమనపెద్దనలు చతుర్లఘుగణములు (భ- స- గా- నల) నాలు గుండవలె నని యంత్యానుప్రాసంబుకు విధించిరి. అప్పకవి భీమనపెద్దనలమత మనుసరించి గణములం జేర్కొని యంత్యానుప్రాసమును మాత్రము పరిత్యజించెను. అనంతు నిది వీనికి భిన్నముగా నున్నది. (చతుర్లఘుగణములందుఁ ద్రిగణంబు+ఐ, నగణము వొందు నని పై పద్యమున కర్థము చెప్పవలె; నలిద్రిగణముపై నగణము వొందు నవినచో సుగమముగా నుండు నని నాయాశయము) మఱి యిందు నగణ మని లక్షణమునఁ గలదు. లక్ష్యమున భగణ మున్నది. సూర్యగణ మన్నచో నిర్బాధకం బగును.

(5) వితాళచౌపద.

అర్కనామగణ మనువుగ రెండు, దార్కొని లఘువొందఁగ నిట్లుండు
దర్కించఁగను వితాళమునందుఁ, జేర్కొనఁ దగు హాఱబిరుదులపెండు.

ఇందుల కర్థము విచార్యము; ఇట్టిది యప్పకవీయమున నొందున్నది, దానియర్థమును విచార్యమే.

భానుయుగముపై బయిననలనిం,పూన మణివిరతి నొంది ధరలో
బానలరుఁ జతుష్పదవి తాళా,ఖ్యానము నవి నాయకతురంగా.

అనంతునిలక్షణ మున్న తెఱఁగరయఁగాఁ బంచదశలఘువులు గల గణము లొకపాదమునఁ గలది యని తెలియవచ్చెడి. యతి తొమ్మిది లఘువులపై నున్నది. అనంతునిపద్యమున సంతానుప్రాసము గలదు గాని మూఁడవపాదమున తకారమునకు మాఱు దకార మున్నది. దీనిచే దడ

లకుఁ బ్రాసమైత్రియుఁ గల దని తేలెడిని. డడలకు యతిప్రాసమైత్రి గల దని కొందఱు లాక్షణికులమతముగాఁ గోచరించెడిఁగాని యప్పకవి వాని నగ్రాహ్యప్రశస్తముల పట్టికకుఁ జేర్చినాఁడు. జ్ఞకు నకారము తద్భవ వ్యాజమునను, నభేదవ్యాజమున వబ, లళ, మున్నగువానికి యతి చెల్లు నప్పుడు (?) డిండీరడంభడాడిమీడోలికాది శబ్దంబులకు సంస్కృతమందున్, దాక దగ్గిర దిగ్గియ దాయాదాద్యాంధ్రశబ్దములకును డకారాదేశము శాబ్దికమతమున ఘటిల్లుచుండ, డడలకు నాదేశవ్యాజమున యతిప్రాస మైత్రి యేలచెల్లరాదు ?

ఇందులకుఁ గొన్ని ప్రయోగంబు లున్నను వాని కిటీవలఁ బాఠాంతరములు గల్పింపఁ బడియె.

ఒక్కయుదాహరణము.

మండితసూర్యరశ్మి రుచిమన్మణిహారచయంబులోఁ గట
స్యంది సుగంధి దానజలసంపద నొప్పెడి వాని... ...(సభాపర్వము)

మండింత యనుపాఠ మచ్చునఁ గనఁబడుచున్నది.

(౬) ద్విరదగతి రగడ-

హరి యొప్పు నన నొప్పు నవతారలఘువిరతి
శరధినగ, నలల, భల, సల, త,రలద్విరదగతి (౫౬ క)

అప్పకవీయము-

శర మొప్పఁ బంచలఘు గణచతుష్టయముచే
విరమంబు రెంటిపై ద్విరదగతి పేరిచే.

పంచలఘుగణము లెనిమిది- నలల,భల,సల,నగ,జల,త,ర,య. ఇందు జల,యగణము లుపయోగపడవు. ఈయంశ మీ రెంటిని పీడుటచే ననంతుఁడు లక్షణము స్పష్టముగాఁ దెలియఁబఱచినాఁడు గాని యప్పకవి చెప్పలేదు.

(?) లళలకుఁ బ్రాసమైత్రి కలిమిరేఫాకార లడలకును గొందఱుమతమునఁ గలదు.

(7) రగడలభిన్నలక్షణములు.

(i) వృషభగమనము.

శ్రీమనోహరు నంబుజోదరుఁ జిత్తజాతగురుం దలంచెదఁ
గామితార్థవిధాయి నిర్జితకాళియాహిని నాశ్రయించెద
ననువుగా భగణములు భానుసమన్విత ద్వితయములు నాలుగు
నవిమిషాధిప లఘుయతి నిడఁగ నలరు వృషభగమనము మేలగు.

భసనలలు- పాఠాంతరము; చతుర్థపాద మనుసరించి యిదియే సమీచనము తొలుత నొకసూర్యగణము వెనుకగా భ-స-నల గణములలో నొండు, ఇట్లు నలుమాఱులు వ్రాసిన నొక చరణ మగును; యతి 14 లఘువులపై (4 గణములపై) నుండును.

(ii) హరిణగతి-

శ్రీనివాసు భ-జింతు నే నని, పూని కుజనుల-పొంతఁబోవని
భానుయుత నల-భసగగంబుల, లోన నిరుదో-లు నసగంబుల
నిరవుగా నిరు-మాఱు లఘువుల, నెల్లవారును-నొగి గణింపఁగ
విరతులను గా-వింప నిమ్ముల, హరిణగతిచెలు-వగు జగమ్ముల.

పై వృషభగతి యీహరిణగతికి ద్విగుణమని భావింపవలయు. పై విధముగనే గణము లుండును, రెండుభాగములుగాఁ జేసి భిన్నయతులను బాటించుచు నారెండుసగముల మొదటఁ బ్రాసముల నిర్మింపవలయు. తృతీయపాదమునఁ గొంతభంగము గానంబడుచున్నది 'ఇరవుగా నిరుమాఱులఘువుల' అనుచో యతిభంగమును, 'ఎల్లవారును- నొగి గణింపఁగ' ననుచోటఁ బ్రాసమును యతియు భంగమగును. అంతియ కాక మూఁడవపాదమున సంతానుప్రాసము తప్పిపోవుచున్నది. 'మరి యుఁ దానిరు-మాఱులఘువులు, నిరవుగా గణి-యింప నార్యులు' అని సవరింప సరిపడునేమో. రగడలంగూర్చి భీమనపెద్దనలు దలపెట్టలేదు; అనంతుఁడే వీనిని మొదలిడినవాఁడుగా నగపడుచున్నది; అవల నప్పకవి రచించెను, గాని యతినియతము పూర్తిగా నిందు భిన్నమై యున్నది చూడుఁడు.

వృషభగతి-

ఇరువదియొనిమిది లఘువులు పది-యొనిట విశ్రాంతియుఁ గూర్చిన
నిరవగు వృషగతి పద్మాధిప-యిది విను మాదరమున సుదమున.

హరిణగతి-

సరహరి పదియు-నాలుగు లఘులు.
కరియతి హరిణ-గతికి నెళవులు.

(౮) యతిభంగములు.

(i) జయభద్రరగడ.

శ్రీకి నొడయుం డనఁగఁ - జిత్తజుని గురుఁడనఁగ
శేషశయనుండనఁగఁ - జెలువుగఁ జతుర్భుజుఁడు
నాకౌకసులనేలు - నముచిసూదనుపూజ
నతఁడు దాఁగైకొన్న - నందగోపాత్మజుఁడు.

ఇందు యతులు మూఁడుస్థలములం దుండవలయును, ప్రథమ పాదమున నట్లేయున్నది; గ్రంథమునఁ దృతీయచతుర్థములట్లే యున్నవి, గాని ద్వితీయపాదమున 'సూదనుపూజ నతఁడు' అను సంధివశమున నేర్పడిన నకారమును హల్లువలె భావించి యతిమైత్రి నొందించుట దోషమగును.

(ii) ఒగిఁ దరువాతి యిండ్లఁ బ్రతులొందఁ గధోంకములక్ సమాధికం
బగు ప్రతిమానుచుం గడమ కాలప్రతుల్ దొరలించి నిల్పఁగాన్.

ఇందును యతిభంగమున్నది.

చతుర్థాశ్వాసము.

వ్యాకరణవిశేషములు:—

కేతన పెద్దనాదు లాంధ్రమునకు వ్యాకరణము వ్రాయుటం గని మనయనంతుఁడు చతుర్థాశ్వాసమునఁ గొంత వ్యాకృతిఁ రచించెను ఇంతేకాక తక్కుంగలయాశ్వాసములందును సందర్భపడినపుడు వ్యాకరణ కార్యముల వివరించెను.

1 ఆ, 39 ప-అయుపేంద్రుని బొడఁగాంచు—అనుపద్యమునఁ ద్రికసంధి.

1 ఆ, 52 ప-పేర్చి పొల్లునకారంబు బిందువగుచు-అనుచోట వర్గయుక్కులు పరంబగునపుడు ద్రుతసంధి.

1 ఆ, 61 ప-62 ప-కళాద్రుతప్రకృతికసంధులు.

1 ఆ, 63 ప-జడంబు ద్వితీయకుఁ బ్రథమ యగునసూత్రమును,

1 ఆ, 64 ప-అకారసంధి, ఉకారసంధి.

1 ఆ, 65 ప-టుగాగమ నుగాగమ సంధులు.

1 ఆ, 66 ప-పదమధ్యములందలినుటులు రువర్ణములస్వరలోపము.

1 ఆ, 85 ప-ఐ, ఔలకు అయి అవు లగుట.

1 ఆ, 114 ప-జ్ఞాకుఁ దద్భవమున నకార మగుట.

1 ఆ, 115 ప-ఆంధ్రలిపి ఋకారసంయుతము లేమి.

ఇట్లు వ్యాకరణాంశములు తెలుపఁబడినవి. ఇప్పటిసులభవ్యాకరణాదు లాంధ్రుల కుపయోగించుటంజేసి సంస్కృతసంధి సమాసప్రకరణములతోఁ జేర్పబడినట్లు ఛందోదర్పణంబందుఁ దత్పూర్వగ్రంథంబులందు లేనిసంస్కృతసంధిసమాసాదులు పద్యరూపములుగా రచియింపఁబడ్డవి. ఇదియే తక్కినవానికన్న నిం దున్నవిశిష్టత. ప్రకృత మనంతుని వ్యాకరణ ప్రయోగములంగూర్చి కొంత చింతింతము. ఇంతకుము న్నే ప్రథమైన, త్రికారంబునకు మున్నగునవి చర్చింపబడిరె ఇంకఁ జతుర్థాశ్వాసమందలివిషయము మాత్రమే కైకొనంబడును.

19 ప-దీనోడయుఁను, ఇదెట్లొదవె కుసంధులఁట.

ఇందు మొదటిది వానిల్లు, దానిల్లు ఇత్యాదిం బోలినదిగానఁ బ్రయోగింపవచ్చు; ఇది + ఎట్లొదవె "ప్రాయస్తుస్యాత్కిమాదికస్యైః" అని చింతామణి, ఇది కిమాదులలోఁ జేరనగుటచే సంధి వైకల్పికము గాన నిత్యరూపము నిర్దోష మగును. ఇవి కుసంధులు గా వని ఫలితార్థము. 20 ప-అతఁడున్నతఁడు-దుస్సంధి.

అతనిధైర్యశక్తి కిన్నరుఁడుగ (భారతము) సురగణంబు క్షోభము నొందె న్నివ్విధమున (౫-హరివంశము) మున్నగుప్రయోగము లున్నవి. ఇది చూచియే కాఁబోలు ననంతుఁడు 'ఇట్టివి దళదోషము లనఁ బట్టగుఁ గృతులందు నివియ భాసురముగఁ జేపట్టుకురు ధీరు లొక్కొకపట్టున డెందమ్ము లలరఁ బల్కనఁ గృష్ణా' యని చెప్పి తప్పించుకొన్నాఁడు.

38 వ-షట్సంధులను జెప్పుచు, 'ప్రకృతిసంధి యన్నది యాంధ్రభాషఁ జొరదు' అన్నాఁడు గాని బ్రహ్మఋషి, మహాఋషి, సప్తఋషులను ప్రకృతిభావసంధివిశిష్టము లగురూపము లాంధ్రభాషయందును గలవు.

51 వ-ఆడఁజెందె ఘనోత్తువల్మ్యాతు వనఁగ.
నాఁగ బింబోష్ఠి నొక్కబింబోష్ఠి యనఁగ.

వృద్ధియతిని యతిప్రకరణమునఁ జెప్పకున్నను నిందుఁ గూర్చి యున్నాఁడు. ఇట్లే కాకుస్వరయతికి నుదాహరణపద్యమున*శసయతి, వికాశిచాపదలో దడప్రాస, ముందు యతిప్రాసప్రకరణములందుఁ జెప్పకున్నను ననంతుఁడు రచించినాఁడని చూడఁబడియె.

62 వ-వర్ణలంబులు నాఁగ సకలజగద్ధితప్రౌఢిమ నాఁగ కుబ్జస్తులనఁగ—

ప్రౌఢి శబ్దము కిన్నంతమే కాని ఇమనిజంతము కాదని సంస్కృత వైయాకరణులయభిప్రాయము. ఆంధ్రమున శ్రీనాథాదిమహాకవిసార్వభౌము లనేకులు బాహాటముగా 'ప్రౌఢిమ'ను బ్రయోగించియున్నారు.

90 వ-అనుగ్రహ నిగ్రహములు.

అల్పాచ్తర మిత్యాది పాణినిసూత్రనియతి తెనుఁగునకు లే దని శాసించినాఁ డనంతుఁడు, పూర్వకవుల ప్రయోగములంబట్టి యిది న్యాయ్యమని తేలుచున్నది.

102 వ-ఓలిఁ బురుషసింహో యని యుగ్గడించుచోటఁ దాసింహ ఇవపురుషో యనంగ.

---

* ఎక్కటియతి యందుఁ కాకాకరము కల్పింపఁబడినను మూలములో నుంటఁ జేసినిది గ్రహింపఁబడియె.

లోపోనము ఆదికేవిసర్గస్య అని చింతామణి చెప్పుచున్నను, నమ శ్శబ్ద విసర్గస్య లోపమోత్వ మపీష్యతే - యను కారికగలదు. గతాను గతికోలో కోయుటంచిత్యాది ప్రయోగములు కారికననుసరించి యేర్ప డినవి. అట్టివే పైసింహాోయని, పురుషోయనంగ, నను ప్రయోగములు.

103 వ- సంస్కృతము తెనుఁగైనఁ దత్సమపదంబు,
దానఁబుట్టి తెనుంగైనఁ దద్భవంబు,
దేశితెనుఁగు దేశజ, మచ్చ తెనుఁగు తెనుఁగు,
నిర్మలుఁడు, సిరి, రాయిడయుఁడు, నిక్కమనఁగ.

పై పద్యమాంధ్రభాష - తత్సమము, తద్భవము, దేశితెనుఁగు, అచ్చతెనుఁగని చతుర్విధమని తెల్పుచున్నది. కాని 'తజ్జానవమాచదేశ్యా గ్రామ్యాచేయం చతుర్విధా భవతి'యని చింతామణి సూత్రము. గ్రా మ్యము భాషలోనొకవిధము కాఁజాలదను కొందఱిమతమునకుఁ జేరిన దీయనంతుని పద్యము. దేశ్యమాంధ్రదేశ్యము, అన్యదేశ్యమని యిరుదె ఆంగులను నిప్పటి యభిప్రాయము న నంతుఁడు పూర్వమే యాంధ్రదేశ్య మచ్చతెనుఁగు, నన్యదేశ్యము దేశితెనుఁగను విభాగమునఁ జెప్పినాఁడు. కేతనపెద్దనలు తత్సమము, తద్భవము, దేశితెనుఁగు, అచ్చతెనుఁగు, గ్రామ్యమని పంచవిధములనిరి. వీరిమతమును గైకొని మన యనంతా మాత్యుఁడు గ్రామ్యమును మాత్రము వదలియున్నాఁడు.

105 వ- పంచమియగు దీనఁబట్టుండి యారుండి......... వానియొక్క-
కులంబు......

ఇందు దీనఁబట్టి + ఉండి- ఇత్వసంధి ప్రుతికటువు;

వానియొక్క-కులంబు- విభక్తుల కుదాహరణముగా నీయఁబడినది ఈవిభక్తి ప్రత్యయము జేర్చివ్రాసిన ప్రయోగము గ్రంథంబుల మృగ్య ము. యొక్క-లోపించి సమాసమగును.

115 క. మఱియుఁ బలుకుఁ బ్రథమపురుష మె
దిరి మధ్యమపురుషపలుకు ధృతి దనుఁ బలుకున్
ధర నుత్తమపురుషక్రియ
వరుస నలింగకములైన వచనము తెనుఁగున్.

పురుషత్రయమునకు లింగవివేకము లేనివచనము లుండునని యర్థము. ఉత్తమమధ్యమములకు మూఁడులింగములందును భేదము లేదుగాని ప్రథమపురుషమున- ఏకవచన పుం- వాఁడు చేయుచున్నాఁడు, స్త్రీ- ఆమె- అది చేయుచున్నది, నపుం- అవి చేయుచున్నవి, అను భేదము లున్నవి గానఁ బైయనంతునివాక్య మవిచారమూలకమే యగును.

116 క. పృథయను నవ్యయ మొక్కఁడు
ప్రథితంబై చెల్లుఁ గృతులఁ బ్రత్యేకముగా
వృథసేయక యెపుడు మనో
రథములు మాకిచ్చు నీ మురద్విషుఁ డనఁగన్.

సంస్కృతావ్యయములలో పృథమాత్రమే తెనుఁగునందుఁ బ్రత్యేకముగాఁ బ్రయోగింపవచ్చునని పైపద్యమునకు భావము.

పలుకులు పృథగా నన్నం బలికితి (శాంతి. ౧ ఆ. 136) అను భారతప్రయోగము పైపృథయను నవ్యయమునకు నాధారముగాఁ గలదు.

పృథయను నొక్కదానికే కాక యనేకసంస్కృతావ్యయములకుఁ బూర్వకవిగ్రంథంబులందుఁ బ్రయోగంబులు గానవచ్చెడు.

జాదరియున్నంబు సూనరియున్నంబు బహిఃపెట్టినతనియున్నమును (భార- శాం- 1 ఆ.)

బంధువు లెత్తఁగిన బహిరయ్యెనుత్తరు (భాగ- దశ. పూర్వ. 978.)

మామా నాపైఁ గోపము వమామా. (భాగ. నవ. 547.)

స్వస్తిజగత్త్రయీభువనశాసనకర్తకు (భాగ- అష్ట- 545)

సద్యంబ బ్రహ్మహత్యాద్యము మొదలైన పాపవర్గం బెల్లన్ (భార- స్వర్గ- ౧ ఆ.)

ఒక దివసంబు నానంద కాననమునందు సర్వదా సిద్ధించుఁ
(కాశీ- ౭ ఆ.)

ధాత్రీశుల కర్జున సర్వత్ర జయము (జైమిని- ౭ ఆ.)

ఎవ్వారు నీ ప్రతి లేరీ భువనత్రయంబున (హరి- ఉత్తర- ౧౦ ఆ.)

కించిత్తు నల్లి గఱచిన (సుమతిశతకము)

ఇల్లు, సదా, సర్వథా, నహి, నాస్తి, అహహ మున్నగు నవ్యయములకు స్వతంత్ర ప్రయోగములు గలవు. అనంతుని వెనుకటికవులు అథవా వినా ప్రభృతులను బ్రయోగించినారు. తనకుమున్నే వృథేత రావ్యయశబ్దములకుఁ గవిప్రయోగము లుండ ననంతుఁ డొకవృథకు మాత్రము సూత్రించుట యతని పరిశీలనలోప మున్నదని తోఁచెను.

పంచాశ ద్వర్ణంబులు:—

121 వ. భూమిఁ బదాఱచ్చులు నాఁగా వెలసి అకార మాదిగా స్వరములగుఁ
కాదొదలు క్షకారము తుదయై ముప్పదినాల్గు హల్లు లగు వ్యంజనముల్.

125 వ. శలలకు భేదము లేదను పలుకున ళాఁదొలఁగినైనను పములగువర్ణంబులు సంస్కృతభాషకు మఱి తెలుఁగున ఱళలనఁగ రెండధికమంద్రు హరీ.

శబ్దచింతామణి- ఆద్యాయాః పంచాశద్వర్ణాః.

ఇందులకు వరరుచివచనము:—

ద్విధాక ఏచో నుస్వారో విసర్గ షోడశస్వరాః

స్పర్శా అంతస్థళోష్మాణ శ్చతుస్త్రింశ ద్ధలస్స్మృతాః.

చింతామణి వరరుచివచనములు క్షకారమును విడిచి ళకారమును వర్ణసముదాయమునఁ జెప్పుచున్నవి గాని పాణిని మహేశ్వరసూత్రములందు ళాలేదు. ఈ యనంతుని పద్యములను ఖండించి యప్పకవి ళకారమును బ్రత్యేకవర్ణముగా నిర్ధరించెను. 'ఏకసీళము దేవహేళనంబు నటం

చు యీజహామ్నాయంబు నందు లేదా, కాళనాళవ్యాళగోళహింతా ళంబులనుచు సంస్కృతభాషయందు లేదా, యని రచించి,

'కాకు షా జడ్డమైన ళకారమగుట
దలఁప కేఁబది లిపులలో దానిఁగూర్చి
తొలుగ భిన్నాక్షరంబైన దొడ్డళాను
విడిచిపెట్టె ననంతుండు వెఱ్ఱి గాఁడె.

యని పరిహాసించియున్నాఁడు:—

యత్ర విశ్వంభవత్యేకనీళం (యజురారణ్యక నారాయణప్రశ్నము)
యద్దేవా దేవహేళనం (యజురారణ్యక నారాయణప్రశ్నము)

ఇందు ళకారమున్నది గాని కాళనాళవ్యాళగోళహింతాళములు లాంతములుగానే పరిగణింపవచ్చు. సరిగదా, ళకారమును నిషేధించిన యనంతుఁడు మఱల,

128 క- ఆదులు వర్గత్రయమును
భూదేవతలు, తవర్గములు రవలును ధా
త్రీదయితులు, యల శషసహ
లాదట నూరుజులు, ళక్షరాఖ్యలు శూద్రుల్.

అనుపద్యమున ళకారమెట్లు గ్రహించినాఁడో తెలియదు. 'తెలుఁగున అళ లనఁగ రెండధికమండ్రు హరీ' యనియోఁ గానఁ దెలుఁగునందని భావించినచో ఆయేల చెప్పలేదను ప్రశ్న సంభవించును.

ఛందోదర్పణమునందలి కొన్ని పద్యములకర్థము సుబోధముగా లేదు. వ్యాసవిస్తరభీతిని వాని నిందుఁ దలపెట్టలేదు.

అనంతుఁడు తిమ్మాన్వీకులకంటె విపులముగా ఛందంబును, వారు చెప్పని యాంధ్రోపయుక్తంబగు సంస్కృతవ్యాకరణంబును రచియించి యప్పకవ్యాదులకు మార్గదర్శకుండయి యాచంద్రతారార్క స్థాయి యగు కీర్తిఁ ప్రశంసితవ్యుండుగా వర్తించుచున్నాఁడు. ఇవ్విమర్శనమందు యతిప్రాసవ్యవస్థ, పిపార్యాగిత్యక్షరాది విషయంబులను శ్రీ గిడుగు వేంకటసీతాపతిగారు విస్తారంబు విమర్శించి యుంటం జేసి వానిని

విడనాడి నాకుఁ బొడఁగట్టిన కొన్నివిషయములను మెఱఁగించి రచించి నాఁడను.

ముద్రణస్ఖాలిత్యములు:—

వావిళ్లవారి ప్రతియందనేక స్ఖలనము లేర్పడియుండుటచేత మేటిల దానింజాలమట్టునకుఁ బరిశీలించి తప్పొప్పులపట్టిక నొందు ననుబంధముగాఁ జేర్చిరి. మఱి యట్లున్నను ననివార్యములుగాఁ గొన్ని యింకను గలవు.

1 అ, 27 ప- అధికశుభం, బాదవును భయములను హానిఁబొందు నృసింహా- ఇందు హానినొందునని మార్చిన యతిభంగము తొలంగును.

1 అ 63 ప- 'అయచేత నద్వితీయ దానిజహావమయ్యెనుంటుఁ బ్రథమ యట్టులుంటుఁ, గ్రతువుఁగాచె దాశరథి కృష్ణుఁడొకపర్వతమును గొడుగుభంగిఁ దాల్చెననగ? జడంబు ద్వితీయకుఁ బ్రథమ విభావనగు ననుటేదీని యర్థము. పర్వతమును ద్వితీయకును, గ్రతువు ప్రథమకు నుదాహరణములగుటచేఁ గ్రతువుపై నర్థబిందువుంట దోషము.

2 అ 48 ప- పెంపారఁ దాజంబులఁ జేర్పు రేఫలో-యతిభంగము; పేర్చు అని సవరించుకోవలయు.

3 అ 48 ప- కనకవస్త్రుని గృత్తకైటభునిగొలుతు ఇదియంతరాక్కర- 1 సూ, 2 ఇం, 1 చం; కైటభునిగొల్తు అనియుండవలయు.

3 అ 57 ప- రగడ- ఇతనిఁగొల్చినఁగాని......ఎనఁగు నివ్విభుఁడనుచు జతురమతు..................బొటింపులం బెంచు అంత్యాను ప్రాస విధిచేఁ బైపావము కడపట 'అంచు'అని యుండనగు.

4 అ 48 ప- 'ఇత్వ ముత్వ మోత్వ మైత్వ మాత్వంబైదు
నాదిసైబు ఋకారము కరమైనపోట'

మొదటిపాద మాటవెలఁదివలె నున్నదిగాన భ్రమంచి యట్లు ముద్రిం

చినట్లు తోఁచెడిఁగాని రెండవపాదము తేటగీతియని స్పష్టముగాఁదెలుపు చున్నది. ప్రథమపాదము గణభంగమగుటంబట్టి తేటగీతియగుటకు 'ఇత్వ ముత్వ మోత్వంబైత్వ మాత్వమైదు' అని మార్పవలయు.

4 ఆ 76 ప- తే. గీ. వామపదవి సర్గాంతవర్ణమోత్వ
మగు రజోగుణమున మనోహరమనంగ.

4 ఆ 81 ప- క కవియుఁబునర్ బుతునమేత కమలాక్షియనగ-పునర్పు తు అనుశబ్దమున 'స' గురువుగానేరదు గాన గణభంగము తటస్థించు. 'కవియును బునర్భుతునమేత' అని సవరింపవలె.

యతిప్రకరణమున 24 యతులపేర్లు నాయాపద్యములకు ముందు ముద్రితములుగాలేక యందు 15 మాత్రమేయున్నవి. ఇంతియుకాక మఱి కొన్ని యతిగణప్రాసభంగములు ముందే పేర్కొనఁబడియె. వీనినన్నిటిని బునర్ముద్రణమున సంస్కరించి సందియంబులు దొలఁగును. వీనినిందు గూర్చుటకు నిదాన మనంతామాత్యునిపై నారోపింపకుండవలయు నను టకేయని తెలుపుచున్నాఁడను.

"అఆవనామెత"

[అర్థవిచారణము.]

మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి.

కూకటి వేణితోఁ గురులు గూడకమున్న కుచప్రరోహముల్
పోఁకలతోడిసామ్యమును బొందకమున్న నితంబసీమకున్
బ్రేకదనం బొకింత ప్రభవింపకమున్న ప్రసూనబాణుఁ డ
ట్టాఁకలఁ బెట్టెఁ దా నఆవనామెతబాలికకై విటావళిన్.

ఈకళాపూర్ణోదయపద్యమునందలి "అఆవనామెత" పదమునకుఁ బండితులు పలువిధము లగునర్థములు తలకొకరీతిఁ జెప్పిరి. అవి కొన్ని వివరింపఁబడుచున్నవి.

(౧) అరవన్=ఎడారిలో, ఆమెత=విందువంటిదగు బాలికకై ప్రసూనబాణుఁడు తాను విటావళిని అట్టాఁకలఁబెట్టెను=నిర్బంధించెను. కలభాషిణి యెడారియందలివిందువలెఁ దృప్తికరముగ నున్నదని భావము. (అరవ శబ్దమున కెడారి యనునర్థ మగపడదు).

(౨) అఆవని–అఆగని, జీర్ణముగాని ఆమెత=విందువంటిది. కలభాషిణి సంపూర్ణమైన విందువంటి దనుట.

(౩) ప్రసూనబాణుఁడు తాన్ అఆవన్ = అఆచునట్లుగా (విటవిజయముచే) ఆమెతబాలికకై= విందైనపిల్లకై (భోగపుఁగన్నియగుట చే విందువంటిది) విటావళి నట్టాఁకలఁబెట్టెను.

(౪) ప్రసూనబాణుఁడు తాను విటావళిని ఆమెతన్=అనుభవమంను బాలికకై అఆవన్ = ఆటంకపఱుచుటకు కేకలు వేయుచుండఁగా అట్టాఁకలఁబెట్టె=మిక్కిలి ఆఁకలియందుఁ బడవైచెను. (విందు ముందఱఁ బెట్టి విటులను మన్మథుఁ దూరించుచుండె ననుట)

(౫) అరవన్=రాజవీధిలో ఆమెతబాలికకై=వడ్డించని విందైన యా కలభాషిణికొఱకై, సిద్ధమైనవిందని యుఁ జెప్పుదురు.

(౬) అలుమనియామెత బాలిక=మన్మథుఁడు పూర్తిగా వలముకొనని విందైన బాలిక (అట్టాడక. అట్టు+ఆడక=మెడనొక్కయాడుపుట).

(౭) అలుచ=అమ్మ. అలవనియామెత బాలిక=అమ్మకమునకు సిద్ధము చేసుని విందువంటి బాలిక.

(౮) "అట్టాడకలఁ బెట్టి తా నలవ నావెల బాలికకై విటావళికా"
ఆవెల బాలికకై=ఆలోగపుఁబిల్లకై (తక్కినది సమము).

ఇట నిన్నివికల్పములు సూచించి యాచిట్టచివర పాఠము బాగుగ నుండునని శ్రీ॥ శే॥ ఓలేటి వేంకటరామశాస్త్రిలవారు (ఆంధ్ర 3 సం. ౨ సంచి) ఒకవ్యాసము వ్రాసిరి. అప్పటి కది యందముగ నున్నదనియే యనుకొంటిని, వారి కాధారముగ చెన్నపురప్రాచ్యలిఖితపుస్తకభాండాగారములోని కొన్ని తాటాకుఁబ్రతులలో 'ఆమెత' కడ ఆమెళ- ఆవెల యను పాఠములు కనఁబడినవేఁట- కాని పెక్కుఁబ్రతులలో 'ఆమెత' యే యున్నది.

ఈపాఠములు నీయర్థములు పరిశీలించినచో 'నలవ' యను నలఘురేఫయుక్తపాఠమును, 'ఆమెత బాలిక' యను పాఠమును బహుపండితాంగీకృతములగుటయే గాక, బహుముద్రితాముద్రితగ్రంథస్థములైనవని తేలినది. లఘురేఫముతో 'నరవ' యనుటయు, 'అలుము' అనుటయు నర్థానుగుణములు కావు. అనుపూర్వ్యతముగ వచ్చు 'అలవనామెత బాలిక' కంటె నైనయర్థము చెప్పనొప్పఁగాని పాఠము మార్చి యేదో యర్థము చెప్పుట నేసి గాదు.

అది యటుండ, శ్రీ సూర్యరాయాంధ్రనిఘంటువున "అట్టాడక" పదమునకు ఒత్తుకు,బాధ అనునర్థము వ్రాయుచు నీపద్య ముదాహరించిరి. అచటిపాఠ మిటు లున్నది.

"అట్టాడకలఁ బెట్టఁ దా నరవ నామెత బాలికకై విటావళికా"

ఇందలి 'యరవ' పదము లఘురేఫయుతము. నిఘంటుకారులు అరవశబ్దమునకు ద్రావిడుఁ డని మాత్ర మర్థమున్నటులు వ్రాసిరి. అది

ప్రకృతమున సరిపడదు గదా? మఱి యిచట నర్థ మెట్లో సాధింపవలసి యున్నది. (౧) లోఁ జెప్పినట్లు అరవశబ్దమునకు ఎడారి యను నర్థము చెప్పఁగొందమనిన, నది యాయర్థమున నప్రయుక్తము సరికదా, అభిధానికము కూడఁ గాదు. (౨) లో వ్రాసినట్లు రాజవీథి యనుటకుఁ బై సమాధానమే చెప్పవలసివచ్చును. కాన నిట శకటరేఫపాఠమే గ్రాహ్యము.

ఇది మెల్లఁ జూడ నా కిట్లు తోఁచినది. 'అఱచు' ధాతువునకు కేక వేయు, పిలుచు ననునర్థము ప్రహతముగ నున్నది. ప్రయోగములు కూడఁ బెక్కులు. అఱవని + ఆమెత = పిలువని విందు. ఇట్టి సంధులు చేయుట పెక్కుచోటులఁ గలదు. కలభాషిణి పిలువనివిందువంటి దని పిండితార్థము. ఒకరింట విందు చేయుచుఁ బిలువకున్నచో మన మూరాట పడుట (ఉవ్విళులూరుట) సహజము. కలభాషిణి పిలువనివిందువలె విటులచిత్తములను అఱ్ఱాఁకలఁ బెట్టినది, అనఁగా బాధలఁ బెట్టినది. (౪) లో సూచించునట్లు అఱ్ఱాఁకటఁ బెట్టె ననిన మఱియు సరసముగ నుండి ప్రకృతార్థమును సార్థకము చేయును. పిలువనివిందు అఱ్ఱాఁకటఁ=మిక్కిలి ఆఁకలియందుఁ బెట్టు ననుట నిజము. ఈపాఠము శేదం మురేమో? ల, ట లకుఁ బెద్దవ్యత్యాసము లేకుండుటచేఁ దాళపత్రప్రతులు పరిగఁ జూచిన సంశయవిచ్ఛిత్తి యగును. 'ఆమెత' యను పాఠ మంగీకరించినపక్షమున నఱ్ఱాఁకటఁ బెట్టె ననుటయే యనుగుణము.

బహుసమ్మతమగు పాఠము విడిచి యొకటిరెండుప్రతులలో నున్న దని "ఆవెలశాలిక" యను పాఠము స్వీకరించుట మంచి దని నాకుఁ దోఁచదు. అట్టర్థము చెప్పిన సీపద్యమునకుఁ గలబింకము చెడు ననిపించు చున్నది. అయినను, నాదిసిద్ధాంత మనను. యదార్థము శీఘ్రము వెల్లడికావలయును.

శ్రీ

ఆంధ్రసాహిత్యపరిషత్తు.

స్వభానునామ సంవత్సర కార్యనివేదిక.

1943—44.

ప్రతిష్ఠాపకులు.

శ్రీ శ్రీ మహారాజా రావు వేంకటకుమారమహీపతి సూర్యారావుబహద్దరువారు
పిఠాపురంమహారాజావారు, పరిషద్యావజ్జీవాధ్యక్షులు.

శ్రీ శ్రీ వేంకటగిరి మహారాజావారు.

శ్రీ శ్రీ బొబ్బిలి మహారాజావారు.

ఉద్ధారకులు.

శ్రీ రాజా వేంకటాద్రి అప్పారావుబహద్దరువారు - ఉయ్యూరు జమీందారువారు.

అధ్యక్షులు.

సాహిత్యవిశారద కాశీభట్ట సుబ్బయ్యశాస్త్రిగారు.

కార్యదర్శులు.

కిడాంబి రాఘవాచార్యులుగారు, ఎం. ఏ. బి. ఎల్.

వింజమూరి వెంకన్నపంతులుగారు, ఎం. ఏ.

కార్యనిర్వాహకసభాసభ్యులు.

శ్రీదివాన్ బహద్దర్ కొమ్మిరెడ్డిసూర్యనారాయణమూర్తినాయుడుగారు (కోశాధ్యక్షులు.)

,, పిల్లారిశెట్టి రంగబ్రహ్మారావునాయుడుగారు.

,, కోటా శివనాథశాస్త్రిగారు.

,, కొమ్మిరెడ్డి కేశవరామమూర్తినాయుడుగారు.

,, చిలకమర్తి లక్ష్మీనరసింహముగారు.

,, నిడుదవోలు వేంకటరావుగారు, ఎం. ఏ.

,, ప్రతివాదిభయంకరం పార్థసారధిగారు, బి. ఏ., ఎల్. ఎల్. బి.

,, కుందూరి ఈశ్వరదత్తుగారు, బి. ఏ.

,, కేశవరపు కామరాజుగారు

,, వేదుల శ్రీరామచంద్రకీర్తిగారు, ఎమ్. ఏ.

,, ఏలేశ్వరపు వెంకటరమణసుబ్బారావుగారు, బి. ఏ., బి. ఎల్.

,, అడ్డాల రామమూర్తిగారు, బి ఎ. బి. ఎల్.

స్వభానుసంవత్సరముతోఁ బరిషత్తునకు ముప్పదిరెండవసంవత్సరము ముగిసినది. యుద్ధపరిస్థితులు తీవ్రముగనుండి పరిషత్కార్యములకు వలయు కాగితము సరిగ లభింపకపోయినను, పత్రికాముద్రణము యథాప్రకారము జరుగుచున్నది. నూతనగ్రంథముల ముద్రించుటకు మాత్రము వీలుకలుగుటలేదు.

పరిషద్భాండాగారము దినదినాభివృద్ధి నొందుచున్నది. నూతన గ్రంథములు చేర్పఁబడుచున్నవి. వినిమయముగఁ బత్రికలఁబంపు పత్రికాధిపతులకును, గ్రంథముల నుచితముగ నొసఁగినవారికిని మన కృతజ్ఞతాభివందనములు. కాశీఖండపు తాళపత్రప్రతులఁ బరిశోధించి యందలి పాఠభేదములు వ్రాయింపఁబడుచున్నవి. త్వరలో వానిని బత్రికాముఖమునఁ బ్రచురించి పాఠకలోకమున కంద జేయఁగలమని యాశించుచున్నాము. ముద్రితాముద్రితగ్రంథముల పట్టికలను వ్రాయించి, కాగితము లభించిన వెంటనే వానిని ముద్రింపవలసియున్నది. కాశీఖండము పాఠభేదములు పూర్తియయిన తరువాత నాంధ్రమహాభారతము ప్రతుల పరిశోధించి పాఠభేదములఁ బ్రకటించుచున్నాము.

శ్రీ శ్రీ పీఠికాపురప్రభువుల యాదరమువలనను గార్యదీక్షవలనను సూర్యరాయాంధ్రనిఘంటువు నాల్గవసంపుటము ముద్రణము పూర్తియైనది. మిగిలిన సంపుటములవలెనే నాలుగవసంపుటముగూడ ప్రతి యొక్కంటికి నాలుగురూప్యములకు విక్రయింపఁబడును. వెనుకటివలె నచ్చుపనిజరుగుటకు సౌకర్యము లేమి నిఘంటుకార్యస్థానమున 'ప' వర్గశబ్దములు పండితులు పరిశోధించి ముద్రణమునకు సిద్ధము చేయుచున్నారు. అచిరకాలముననే అయిదవసంపుటము ముద్రణము ప్రారంభింపఁబడును.

స్వభానుసంవత్సర ఆయవ్యయపట్టిక నరిచూడఁబడి యనుబంధమునఁ జేర్పఁబడినది. శ్రీ శ్రీ బొబ్బిలి, వేంకటగిరిమహారాజావారలిచ్చిన విరాళములవడ్డీవలనను, పుస్తకవిక్రయమువలనను లభించిన ద్రవ్యముతోడను, పరిషత్కార్యముల యథావిధిగ నిర్వహింపఁగలుగుచున్నాము.

శ్రీ శ్రీ బొబ్బిలిమహారాజావారి పత్రములవలన నీసంవత్సరము రు 400-లును వేంకటగిరివారి పత్రములవలన రు 350- లును వచ్చినవి. నిఘంటుసంపుటములయొక్క విక్రయమువలనను పరిషద్గ్రంథ విక్రయము వలనను రు 691-7-0 లు వచ్చినవి.

నూతనభవనమునఁ బరిషత్కార్యాలయమునఁ జేర్చినతరువాత నితోఽధికముగ కార్యనిర్వహణ మొనర్చుటకు ప్రయత్నములు జరుపఁబడునని నివేదించుచున్నాము.

పరిషత్కార్యనిర్వహణమును గూర్చియు, పరిషదుద్దేశములను గూర్చియు నాంధ్రదేశమునఁ బ్రచారము గావించి వలయుధనమును సంపాదింపవలసియున్నది. అందులకుఁ దగినసహాయమును గార్యనిర్వాహకసభ్యులును, పరిషత్సభ్యులును జేయుదు రని యాసించుచున్నాము. పరిషత్కార్యముల సహాయమునొసంగి తమ యభిమానమును నిరంతరముఁ జూపుచున్న కార్యనిర్వాహకసభ్యులకు మావందనములు.

మాకోరికపై శ్రమయనక నాయవ్యయములఁ బరిశీలించి యీ సంవత్సరము లెక్కలను సరిచూచిన శ్రీ పల్లె వెంకటహనుమంతరావు గారికి మావందనములు.

ఇట్లు విధేయులు,
కిళాంబి రాఘవాచార్యులు,
వింజమూరి వెంకన్న,
కార్యదర్శులు.

ఆంధ్ర సాహిత్య
స్వభానునామసంవత్సర
ఆదాయవ్యయముల

నెం.	ఆదాయము.			రు.	అ.	పై
1.	సంవత్సర ప్రారంభనిలవ		...	78	7	2
2.	వడ్డీ - బ్యాంకుద్వారా వసూళ్లు		...	750	1	0
	శ్రీ శ్రీ బొబ్బిలి మహారాజా వారిచ్చిన గవర్నమెంటుపత్రముల వడ్డీ 1943-44	రు 400-0-0				
	వెంకటగిరి ,,	350-0-0				
	బ్యాంకివడ్డీ	0-1-0				
		750-1-0				
3.	సాధారణసభ్యుల చందాలు		...	18	0	0
4.	చందాలు		...	81	0	0
5.	విక్రయములు		...	691	7	0
	i. పరిషత్తుపత్రికల విడిసంచికలు	3-8-0				
	ii. పుస్తకములు(షెడ్యూలుదాఖలా)	687-15-0				
6.	చిల్లర జమలు		...	0	2	6
7.	శ్రోత్రిపల్లి సుబ్రహ్మణ్యముగారు		...	4	1	9
				1623	8	5

కాశీభట్ల సుబ్బయ్యశాస్త్రి,
అధ్యక్షులు.

కిడాంబి రాఘవాచార్యులు,
వింజమూరి వెంకన్న,
కార్యదర్శులు.

పరిషత్తు - కాకినాడ.

(6-4-43 మొదలు 24-3-44 వరకు.)

తబిశీలు లెక్క.

నెం.	వ్యయము.			రు.	అ.	పై.
1.	బ్యాంకి చిల్లరవ్యయములు		...	1	0	0
2.	క్యాటలాగు వ్రాసినపండితునకు		...	20	0	0
3.	కొత్తపల్లి సుబ్రహ్మణ్యంగారు- (శ్రీ శే॥ కొ. సూ. జీతంబాపతు)			20	4	0
4.	పోస్టేజి		...	36	2	6
5.	ప్రయాణవ్యయము		...	10	4	0
6.	జీతములు		...	701	15	6
7.	పత్రికకు కాగితము		...	68	6	0
8.	ప్రింటింగు		...	110	0	0
	బైండింగు :		...	195	8	0
	i. లైబ్రరీ పుస్తకములు	13-4-0				
	ii. లెక్సికన్	182-4-0				
9.	పత్రికలకు చందాలు		...	48	10	0
10.	పుస్తకములు - ఖరీదుచేసినవి		...	103	5	0
11.	సాదరు		...	20	10	8
12.	నగదు నిలవ		...	292	2	2
	బ్యాంకిలో	9-6-7				
	కార్యదర్శివద్ద	282-11-7				
				1628—3—5		

6-4-43 మొదలు 24-3-44 ఆఖరుకు అయ్యే స్వభాను నామ సంవత్సరపు ఆంధ్ర సాహిత్యపరిషత్తు యొక్క బుక్కులను బట్టిన్ని, లెక్కలను బట్టిన్ని, యీ పై ఆదాయ వ్యయముల తబిశీలు లెక్క నేను తనిఖీచేసినాను. కావలసిన యావత్తు సంజాయిషీ పుచ్చుకున్నాను. ఈపై ఆదాయవ్యయము లెక్క నిజమైనట్టిన్ని, సరియైనట్టిన్ని, స్థితిని కనపరచుచున్నదని నేను యిందుమూలముగా తెలియచేయుచున్నాను.

కాకినాడ
2-6-1944.

పల్లె వెంకటహనుమంతరావు,
2-6-44.
గవర్నమెంటు డిప్లమాహోల్డరు ఇన్ కామర్సు
ఇన్‌కమ్‌టాక్సు ప్రాక్టీషనరు అండు ఆడిటరు.

పుస్తకవిక్రయము

	రు.అ.పై		రు.అ.పై
విప్రనారాయణచరిత్రము	2- 5-9	రాయవాచకము	2-12-6
జైమినిభారతము	33- 3-0	సింహాసనద్వాత్రింశిక 1 భా	3- 8-0
కవిజనాశ్రయము	14- 8-3	డిటో 2 భా	3- 8-0
యుద్ధమల్లుని బెజవాడశిలాశాసనం	1-12-3	నిఘంటుచరిత్రము	0-11-0
జ్యోతిశ్శాస్త్రసారము	1- 5-6	ఆంధ్రకౌముది	3- 2-6
జ్ఞానప్రసూనాంబికాశతకము	0- 1-9	బాలభారతము	24-10-9
సర్వేశ్వరశతకము	0- 8-9	Dravidian Lexicography	0-7-0
కావ్యాలంకారచూడామణి	2-15-6	Defence of Literary Telugu	0-15-6
అకారాద్యనుక్రమగ్రంథసూచిక	0-14-6	చాటుధారాచమత్కారసారః	2- 0-3
ప్రాకృతభాషోత్పత్తి	3-15-3	సాంబోపాఖ్యానము	0-14-6
శివతత్త్వసారము	2-13-9	రసార్ణవాలంకారము	1- 2-3
చంద్రభానుచరిత్రము	3- 2-6	కవిజనోజ్జీవని సమస్యలు	0-14-3
శివరాత్రిమాహాత్మ్యము	13- 3-0	రఘునాథరామాయణము	1-12-6
ఆర్యభాషావిభాగము	3- 1-3	రజతోత్సవసంపుటము	3- 2-6
ప్రాస్వరంగములు	0-15-3	ఆంధ్రసాహిత్యపరిషద్వృత్తాంతం	0-14-3
నారసింహపురాణము	1-12-3	అరవదేశమునందలిఆంధ్రవాఙ్మయం	2- 4-6
మన్నారుదాసవిలాసనాటకము	1- 3-3	లౌకికన్యాయవివరణము	1- 6-3
కాళిందీకన్యాపరిణయము 1 భా	4- 6-6	లక్షణసారసంగ్రహము	3-10-0
డిటో 2 భా	2- 3-0	కావ్యాలంకారచూడామణి పాఠభేదములు	0- 9-0
రెడ్లపాటి రెండుశాసనములు	0- 7-3	ఉత్తరరామచరితము	4-12-6
ఆంధ్రధాతుమాల	2-10-3	శ్రీసూర్యరాయాంధ్రనిఘంటువు	
శాసనపద్యమంజరి 1 భా	0-10-6	1 భా	158- 8-0
డిటో 2 భా	0-14-3	2 భా	136- 4-0
శతకసముచ్చయము 1 భా	5- 1-3	3 భా	185-12-0
డిటో 2 భా	4- 3-9	అమరుకము	5- 0-9
పరిషత్పుస్తకభాండాగారము 2 భా	1- 3-3	చంపూరామాయణము	2-12-6
సూత్రాంధ్రవ్యాకరణము	3- 0-6	ఆంధ్రవాఙ్మయవికాసశైఖరి	3- 3-6
రసాభరణము	2-12-3	బాలరామాయణము	0- 1-9
ఆంధ్రశబ్దచింతామణి	4- 4-6	సీతారామచరిత్రము	0- 7-3
షోడశకుమారచరిత్రము	1-14-6	పరిషత్పుస్తకభాండాగారము 3 భా	0-13-3
హంససందేశము	0- 4-6		
			687-15-0